- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

ఆదివారం
14-06-2026

సంపుటి : 01 సంచిక : 83 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 83 NAMASTEY MAHAAPRABHA



Mr.NAKKA RAJU
Chairman of Mahaaprabha



## సింగపూర్ పర్యటనకు సీఎం చంద్రబాబు..

- అమరావతి అభివృద్ధి.. రాష్ట్ర పెట్టుబడుల కోసం చంద్రబాబు కీలక భేటీలు..
- సింగపూర్ వేదికగా ఏపీకి భారీ పెట్టుబడుల ఆకర్షణకు సీఎం ప్రయత్నం.

**అమరావతి జూన్ 13 ( మహాప్రభ)**
రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం, అమరావతి నిర్మాణ ప్రాజెక్టులకు ఊతం కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ పర్యటనలో సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులతో సీఎం బృందం కీలక సమావేశాలు నిర్వహించనుంది. 14వ తేదీ ఉదయం 11.35 గంటలకు బెంగళూరు నుంచి సీఎం సింగపూర్ బయలుదేరి వెళ్లనున్నారు. పర్యటన ప్రారంభమైన తర్వాత జూన్ 15న సింగపూర్లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో మొదటి సమావేశం నిర్వహిస్తారు. తొలిరోజు స్టార్టప్‌లు, వెంచర్

-మిగతా 3 లో

## హైదరాబాద్‌లో భారీ వర్షాలపై
# హై అలర్ట్

కోర్ అర్బన్ రీజియన్‌లో
అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం

- భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తత
- అన్ని శాఖల మధ్య సమన్వయంతో చర్యలు
- ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ
- సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల మోహరింపు
- ట్రాఫిక్, విద్యుత్ తాగునీటి సేవలపై ప్రత్యేక దృష్టి
- సమస్యాత్మక ప్రాంతాలకు టీమ్‌లను ముందుగా పంపండి
- భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం ఆదేశాలు



హైదరాబాద్‌లో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని 24 గంటలు అప్రమత్తంగా ఉంచాలని సూచించారు.

3



## అస్సాంలో ఐఎఎఫ్ విమానం కూలి ఐదుగురు సైనికులు మృతి

- జోర్హాట్ సమీపంలో ల్యాండ్ అవుతుండగా ప్రమాదం
- ప్రాణాలతో బయటపడిన కో-పైలట్.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలింపు
- ప్రమాద కారణాలపై విచారణకు కోర్ట్ ఆఫ్ ఇంక్వైరీ ఆదేశం
- వీర జవాన్ల మృతిపై ప్రగాఢ సానుభూతి తెలిపిన భారత వాయుసేన

3



## 16 ఏండ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్!

- యూకే ప్రభుత్వం నిర్ణయం!
- సెక్సువల్ ఏఐ చాట్‌బాట్ల వినియోగంపై 18 ఏండ్ల లోపు వారికి నిషేధం
- సోమవారం అధికారికంగా నిబంధనలు ప్రకటించనున్న ప్రధాని
- సర్వేలో నిషేధానికి మద్దతుగా 90 శాతం మంది తల్లిదండ్రుల మొగ్గు

3

## భారత ఆర్మీ నూతన చీఫ్‌గా ధీరజ్ సేత్..

- ఈ నెల 30న నూతన సైన్యాధిపతి బాధ్యతల స్వీకారం
- 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనున్న పదవీకాలం
- నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సైనిక సేవా అనుభవం
- తిరుగుబాటు నిరోధక దళ కమాండర్‌గా విశేష సేవలు



**న్యూఢిల్లీ జూన్ 13 ( మహాప్రభ)**
భారత సైన్యం లో అత్యున్నత పదవి అయిన ఆర్మీ చీఫ్ గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియమితులయ్యారు. ప్రస్తుత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో 2026 జూన్ 30 నుంచి ధీరజ్ సేథ్ భారత సైన్యాధిపతిగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం శనివారం అధికారికంగా ప్రకటించింది. రాష్ట్రపతి ఆమోదంతో ఈ నియామకం జరిగినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఆయన పదవీకాలం ఆగస్టు 31 2028 వరకు కొనసాగనుంది.ప్రస్తుతం ఆర్మీ వైస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేస్తున్న ధీరజ్ సేథ్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సైనిక సేవా అనుభవం ఉంది. ఖడక్‌వాస్లాలోని జాతీయ రక్షణ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన ఆయన


-మిగతా 3 లో

## పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

- 19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు




3



## గడువుకు ముందే పంజాబ్ ఎన్నికలు

- పార్టీ కార్యాకర్తలు ప్రచారంలోకి దిగండి
- నవంబర్‌లోనే ఎన్నికలు జరిగే ఛాన్స్
- ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సంకేతాలు

**చండీగఢ్, జూన్ 13 ( మహాప్రభ)**
పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు గడువు కంటే ముందుగానే జరిగే అవకాశం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంకేతాలిచ్చారు. 2027 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2026 నవంబర్‌లోనే ఎన్నికలు జరగవచ్చని అన్నారు. 'ఆప్' ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని ప్రకటించారు. బటిండాలో శనివారంనాడు జరిగిన రోడ్‌షోలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు తక్షణం ఎన్నికల

-మిగతా 3 లో



## కాంగ్రెస్ సినిమా ఫస్ట్ ఆఫ్ ఫెయిల్

- సెకండ్ ఆఫ్‌పై ఆశ లేదు
- సీఎం రేవంత్‌రెడ్డికిడైలాగ్‌లు ఎక్కువ.. పని తక్కువ
- మళ్లీ కేసీఆర్ నాయకత్వవే రాష్ట్రానికి అవసరం
- సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


**రాజన్న సిరిసిల్ల జూన్ 13 ( మహాప్రభ)**
రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికార సినిమా ఫస్ట్ అఫ్ పూర్తిగా ఫెయిల్ అయింది.. సెకండ్ ఆఫ్ పై ప్రజలకు ఆశ లేదు.. మళ్లీ రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వమే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో, వేములవాడ పట్టణంలో శనివారం నియోజకవర్గస్థాయి డిజిటల్ సభ్యత్వ నమోదు కార్య క్రమాలకు కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన

-మిగతా 3 లో

# బీజేపీ తీరు అప్రజాస్వామికం

కేంద్రం ఒత్తిడి వల్లే మీనాక్షి నామినేషన్ తిరస్కరణ

- అప్పుడు ఓటు చోరీ.. ఇప్పుడు సీటు చోరీ బీజేపీకే సాధ్యం
- షబ్బీర్ అలీ వ్యాఖ్యలపై షోకాజ్ నోటీసు ఇచ్చాం
- ఫోర్త్ సిటీని అడ్డుకుంటామనడం బీఆర్ఎస్ మూర్ఖత్వం
- వచ్చే ఎన్నికల్లో ఆ ఎనిమిది మంది బీజేపీ ఎంపీలూ ఓడిపోతారు
- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ జూన్ 13 ( మహాప్రభ)**
మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు అప్రజాస్వామికమని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మీడియా చిట్‌చాట్‌లో బీజేపీ తీరుపై విమర్శలు గుప్పించారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలనే కుట్రతో మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపించారు. ప్రయివేట్ వ్యక్తులు వేసిన కేసులో కోర్టు సాధారణ నోటీసులు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ కేసులో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదనీ, కేవలం రాజకీయ ఒత్తిడి వల్లనే రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) నామినేషన్ తిరస్కరించారని అన్నారు. తాము కాంగ్రెస్ పార్టీ పక్ష్షాల ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే కనీస స్పందనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కొంత మంది బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.

-మిగతా 3 లో

## ఏపీకి కేంద్రం భారీ గ్రాంట్



3

- గ్రామీణాభివృద్ధికి రూ.16,627 కోట్లు
- 16వ ఆర్థిక సంఘం సిఫారసులతో రాష్ట్రానికి భారీ కేటాయింపులు
- గతం కంటే రూ.3,827 కోట్లు అధికంగా మంజూరు
- తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలకే ప్రాధాన్యం
- గ్రామ పంచాయతీలకు 70 శాతం నిధుల కేటాయింపు
- నిధుల విడుదలకు ఎన్నికలు, ఆన్‌లైన్ నిబంధనలు తప్పనిసరి

## ఢిల్లీలో దారుణం..
## 70 ఏళ్ల వృద్ధ దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం..




**న్యూఢిల్లీ ,జూన్ 13 ( మహాప్రభ)**
దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన జరిగింది. 70 ఏళ్లున్న వృద్ధ దివ్యాంగురాలిపై ఒక వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన తూర్పు ఢిల్లీ, త్రిలోక్‌పురి ప్రాంతం, మయూర్ విహార్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది.బాధిత వృద్ధురాలు అంధురాలు. మానసిక వైకల్యం కూడా ఉంది. ఆమె ఇదే ప్రాంతంలో 35 ఏళ్లుగా, వీధుల్లో ఒంటరిగా ఉంటోంది. స్థానికులు ఆమెకు ఆహారం, బట్టలు వంటివి అందిస్తుంటారు. గత గురువారం అర్ధరాత్రి ఆమె ఒక షాపు పక్కన ఒంటరిగా నిద్రిస్తుండగా, ఒక వ్యక్తి ఆమె వద్దకు వచ్చి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె ప్రతిఘటించింది. వెంటనే నిందితుడు కోపంతో ఆమెపై ఇటుకతో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వృద్ధురాలిపై అత్యాచారయత్నం అనంతరం నిందితుడు అక్కడినుంచి పారిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు బాధిత మహిళను ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఢిల్లీలో ఇటీవల వరుసగా జరుగుతున్న హింసాత్మక ఘటనలతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## భారత్ -నేపాల్‌ల మధ్య సరిహద్దు రైల్వే



**న్యూఢిల్లీ ,జూన్ 13 ( మహాప్రభ)**
భారత్- నేపాల్‌ల మధ్య సరిహద్దు రైల్వే అనుసంధానం కోసం, నేపాల్‌లోని జనక్‌పూర్- ఉత్తరప్రదేశ్ అయోధ్య మార్గంలో ప్రయాణీకుల రైల్వే సేవల కోసం ఇరు దేశాలు చర్చించాయి. ఈ రెండు దేశాల మధ్య జరిగిన చర్చలు జూన్ 11 -- 12 తేదీలలో ఇక్కడ జరిగిన 10వ ప్రాజెక్ట్ స్టీరింగ్ కమిటీ, 8వ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశాలలో భాగంగా జరిగాయని ఖాట్మాండ్‌లోని భారత రాయబార కార్యాలయం శుక్రవారం తెలిపింది. జనక్‌పూర్-అయోధ్య మార్గంలో ప్రయాణికుల రైలు సేవలను ప్రారంభించడానికి సంబంధించిన ప్రామాణిక నిర్వహణ విధానాలపై ఇరుపక్షాలు చర్చించాయి. సీత జన్మస్థలం జనక్‌పూర్, బాలరామున్ని ప్రతిష్టించినది అయోధ్య. జనక్‌పూర్- అయోధ్య రైల్వే లైన్‌తో ఈ రెండు దేశాలను యాత్రికులు సందర్శించడానికి వీలవుతుంది. అందుకే భారత్- నేపాల్ ఇరుపక్షాలు ఈ రైల్వే లైను నిర్మించడానికి సుముఖత వ్యక్తం చేశాయని భారత కార్యాలయం వెల్లడించింది

## పాకిస్థాన్‌కు చేరిన హంగోర్ క్లాస్ జలాంతర్గామి..



**న్యూఢిల్లీ,జూన్ 13 ( మహాప్రభ)**
చైనా నిర్మించిన హంగోర్ క్లాస్ జలాంతర్గామి పాకిస్థాన్‌కు చేరింది. అది తాజాగా కరాచీ రేవు కు చేరుకుంది. అది డీజిల్-ఎలక్ట్రిక్ ఎటాక్ సబ్‌మెరైన్. అలాంటివి మొత్తం 8 జలాంతర్గాములను పాకిస్థాన్ కొనుగోలు చేస్తోంది. అందులో నాలుగింటిని చైనా నిర్మిస్తుంది. మిగతావాటిని సాంకేతిక పరిజ్ఞాన బదలాయింపు కింద కరాచీలో రూపొందిస్తారు.హంగోర్ అంటే బెంగాలీలో సొరచేప అని అర్థం. 1971 కి ముందు తమ దేశంలో భాగంగా బంగ్లాదేశ్ ఉన్నప్పటి ఆనవాయితీకి అనుగుణంగా పాకిస్థాన్ ఈ పేరును ఖరారు చేసింది. ఈ తరగతి జలాంతర్గాములు అధునాతనమైనవి. ప్రత్యర్థి కంటపడకుండా దాడిచేసే సామర్థ్యం వీటికి ఉందని అధికారులు తెలిపారు.

## 18 ఏండ్లు పైబడిన వారికి ఆధార్ జారీ బంద్!
### - అస్సాం క్యాబినెట్ నిర్ణయం

**న్యూఢిల్లీ,జూన్ 13 ( మహాప్రభ)**
అక్రమ వలసదారులు ఆధార్ కార్డులను పొందకుండా నిరోధించేందుకు 18 ఏండ్లు పైబడిన వారికి ఆధార్ కార్డులు జారీ చేయకూడదని తన మంత్రివర్గం నిర్ణయించిందని అస్సాం



ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ శనివారం తెలిపారు.అసాధారణ సందర్భాల్లో ఆధార్ కార్డును జారీ చేయడానికి అనుమతి కోరుతూ జిల్లా కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాల్సి ఉంటుందని చెప్పారు. ఆ దరఖాస్తుదారు కార్డు పొందడానికి అర్హుడా? కాదా? అనేది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని ఆయన తెలిపారు.

# టీవీకే సర్కారు బీజేపీకి జిరాక్స్ కాపీ..

### -విజయ్ తీరుపై స్టాలిన్ విమర్శలు

**న్యూఢిల్లీ,జూన్ 13 ( మహాప్రభ)**
తమిళనాడులో అధికారంలో ఉన్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) సర్కారుపైన, ముఖ్యమంత్రి విజయ్ తీరుపైన డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. టీవీకే సర్కార్ బీజేపీకి 'జిరాక్స్ కాపీ' లా మారిందని, అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కొనుగోలు చేస్తూ ప్రతిపక్షాన్ని బలహీనపరిచే కుట్రకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. శనివారం చెన్నైలోని అన్నా అరివాలయంలో జరిగిన డీఎంకే మహిళా విభాగం సమావేశంలో స్టాలిన్ ప్రసంగించారు.ఇతర రాష్ట్రాల్లో బీజేపీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక వ్యూహాలనే తమిళనాడులో టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి విజయ్ అన్నాడీఎంకే ఎమ్మెల్యేల కోసం



'షాపింగ్' చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికలు ముగిసి 21 రోజులు కూడా గడవకముందే వేలికి ఉన్న సిరా గుర్తు చెరగకముందే నలుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరారని, వారికి ఎలాంటి ఆఫర్ ఇచ్చి చేర్చుకున్నారని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళల భద్రతాఅంశాన్ని ప్రస్తావిస్తూ శ్రీవైకుంఠంలో జరిగిన ఒక లైంగిక వేధింపుల ఘటనను స్టాలిన్ ఉదహరించారు. ఈ కేసులో బాధితురాలు టీవీకే సభ్యురాలైతే, నిందితులు కూడా అధికార పార్టీకి చెందినవారని ఆయన ఆరోపించారు. అయితే నిందితులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, బాధితురాలినే పార్టీ నుంచి తొలగించడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. టీవీకే కార్యకర్తల నుంచి మహిళలకు రక్షణ కల్పించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. గతంలో టీవీకే ప్రభుత్వంపై తాను చేసిన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారని స్టాలిన్ స్పష్టంచేశారు. కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని భావించినప్పటికీ ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు తనను మౌనంగా ఉండనివ్వడం లేదని స్టాలిన్ పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని కూల్చడం తమ ఉద్దేశం కాదని, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా డీఎంకే తన పాత్రను పోషిస్తుందని ఆయన స్పష్టంచేశారు. రాబోయే ఎన్నికల్లో డీఎంకేను తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి మహిళా కార్యకర్తలు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## జూలై 9న ఇరాన్ మాజీ సుప్రీం లీడర్
# అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు

**న్యూఢిల్లీ,జూన్ 13 ( మహాప్రభ)**
ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు వచ్చే నెల (జూలై) 9న జరగనున్నాయి. ఖమేనీ స్వస్థలమైన మషాద్ లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. జూలై 4 నుంచి ఖమేనీ అంత్యక్రియల ప్రక్రియ మొదలవుతుందని తెలిపింది. అమెరికా-ఇజ్రాయెల్ సైన్యాలు ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్ పై చేసిన దాడుల్లో ఖమేనీ మరణించారు. అయితే భీకర యుద్ధం కారణంగా ఆయన అంత్యక్రియలు వాయిదాపడుతూ వస్తున్నాయి.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, భద్రతా కారణాలు, మొహర్రం మాసంలో ప్రజల సంతాప కార్యక్రమాలు ఉన్నందున ఈ



అంత్యక్రియలు వాయిదాపడ్డాయి. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొదటి నెల అయిన 'మొహర్రం' ప్రారంభంలో (జూన్ ఆరంభంలో) ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇరాన్ అంతకుముందు భావించింది. అయితే కర్బలా యుద్ధంలో (క్రీ.శ. 680) అమరులైన ప్రముఖ షియా నాయకుడు ఇమామ్ హుస్సేన్ స్మారకార్థం భక్తులు జరిపే వార్షిక సంతాప కార్యక్రమాలను పూర్తి చేసుకునేందుకు వీలుగా ముహర్రం మొదటి వారం తర్వాతే ఈ అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆ మేరకు జూలై 9వ తేదీని ఖరారు చేశారు. ఈ కార్యక్రమానికి దాదాపు 2 కోట్ల (20 మిలియన్ల) మంది ప్రజలు హాజరవుతారని టెహ్రాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు 37 ఏళ్లపాటు ఇస్లామిక్ రిపబ్లిక్‌కు నాయకత్వం వహించిన ఖమేనీ, ఫిబ్రవరి 28న మధ్య టెహ్రాన్‌లోని తన నివాసంలో మరణించారు. వాస్తవానికి మార్చి 4న జరగాల్సిన ఈ అధికారిక అంత్యక్రియల కార్యక్రమం, యుద్ధం కారణంగా వాయిదా పడింది.

# యూట్యూబర్ మిస్టర్ బీస్ట్ సరికొత్త రికార్డు..

### 50 కోట్ల సబ్‌స్క్రైబర్‌లు దాటిన తొలి క్రియేటర్..!

**న్యూఢిల్లీ,జూన్ 13 ( మహాప్రభ)**
ప్రపంచంలోనే నెంబర్ వన్ యూట్యూబర్ గా పేరొందిన మిస్టర్ బీస్ట్ సరికొత్త రికార్డు సృష్టించారు. యూట్యూబ్‌లో 50 కోట్ల సబ్‌స్క్రైబర్లు దాటిన తొలి క్రియేటర్‌గా నిలిచాడు. 2026 జూన్ 12న మిస్టర్‌బీస్ట్ తన అధికారిక యూట్యూబ్ ఛానల్ లైవ్‌లో ఉన్న సమయంలో 50 కోట్ల సబ్‌స్క్రైబర్ల మార్క్‌ను చేరుకున్నాడు. యూట్యూబ్ చరిత్రలో ఇది మరో మైలురాయిగా చెప్పవచ్చు.కాగా మిస్టర్ బీస్ట్ ఫిబ్రవరి 2012లో తన యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించాడు. అప్పుడు అతడి వయసు 13 ఏళ్లు.




2017లో అతడు అంకెలను లక్ష వరకు లెక్క పెడుతూ చేసిన వీడియోకు విస్తృత ప్రజాదరణ లభించింది. మిస్టర్ బీస్ట్ అసలు పేరు జేమ్స్ డోనాల్డ్‌సన్. అతడు తన 'బీస్ట్ ఫిలాంత్రపీ' ఛానల్ పైన వచ్చే మొత్తం ఆదాయాన్ని సేవా కార్యక్రమాలకే వెచ్చిస్తుంటాడు. చెట్లను నాటడం, సముద్రాల శుభ్రత, పేదలకు ఇళ్లు, ఆహారం అందించే ఎన్నో సామాజిక కార్యక్రమాలను చేపడుతుంటాడు. బాలకార్మికులుగా పనిచేస్తున్న పిల్లలకు విముక్తి కలిగించడంతోపాటు 'లైట్ ఏఐ' అనే ప్రాజెక్ట్‌ని మొదలుపెట్టి స్మార్ట్‌ఫోన్, ఏఐ పరిజ్ఞానంతో టెస్టులు చేయిస్తూ అవసరం అయిన వారికి చికిత్సలూ చేయిస్తున్నాడు. 'ఘనా మేక్ ఎ డిఫరెన్స్' అనే స్థానిక స్వచ్ఛంద సంస్థతో కలిసి గుండె జబ్బులున్న పిల్లలకు శస్త్రచికిత్సలు చేసేందుకు వీలుగా అత్యాధునిక సదుపాయాలతో సర్జికల్ సెంటర్‌ను ప్రారంభించాడు. కెన్యా, జింబాబ్వే, ఉగాండా ప్రాంతాల్లోని పిల్లలకు మంచినీరు అందించడం కోసం వంద బావులు తవ్వించాడు. వీటన్నిటి వీడియోలను ఆయన యూట్యూబ్‌లో పంచుకుంటాడు. దాంతో ప్రపంచవ్యాప్తంగా కొట్లాది మంది మిస్టర్ బీస్ట్‌ను అభిమానిస్తారు.

# విజయ్ కుటుంబంలో అనూహ్య పరిణామం

### -భార్య సంగీతను మళ్లీ కుటుంబంలోకి తీసుకు వచ్చే యత్నం
### -రంగంలోకి దిగిన విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్

**న్యూఢిల్లీ,జూన్ 13 ( మహాప్రభ)**
తమిళనాడు సీఎం విజయ్ జోసెఫ్ సంసారం చక్కదిద్దే పనిలో ఆయన తల్లి శోభ రంగంలోకి దిగినట్లు సమాచారం. సిఎం కావడంతో విజయ్ ప్రస్తుతం ప్రజాసేవలో మునిగిపోయారు. పదవి చేపట్టిన దగ్గరనుంచి ఆయన ప్రజలకు మంచి చేయాలని చూస్తున్న వేళ క్షణం తీరికి లేకుండా ఉన్నారు. ఇంకోపక్క ఇండస్ట్రీక్రి కూడా దగ్గరగానే ఉంటున్నారు. ఇక ఇదంతా పక్కన పెడితే.. విజయ్ వ్యక్తిగత విషయం ఒకటి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గత కొంతకాలంగా విజయ్, ఆయన భార్య సంగీత విడివిడిగా ఉంటున్న విషయం తెల్సిందే. ఎన్నికల సమయంలో విజయ్ భార్య సంగీత.. తన భర్త నటి త్రిషతో రిలేషన్ లో ఉన్నారని, తనను, తన పిల్లలను ఆయన మోసం చేశారని, తనకు విడాకులు ఇప్పించాలాని కోర్టులో కేసు వేశారు. విజయ్ సీఎం




అయ్యినప్పుడు కానీ, ప్రమాణ స్వీకారం అప్పుడు కానీ.. సంగీత, పిల్లలు ఆయన పక్కన లేరు. దీంతో వీరిమధ్య దూరం బాగా పెరిగిందని, సంగీత ఇక లండన్ నుంచి రాదనుకున్నారు. త్వరలోనే విజయ్.. త్రిషను పెళ్ళి చేసుకుంటున్నట్లు కూడా వార్తలు వినిపించాయి. ఇక తాజాగా ఇండస్ట్రీ మొత్తానికి షాక్ ఇచ్చినట్లు విజయ్ - సంగీత కలిసిపోయారని సమాచారం. వీరిద్దరి మధ్య ఉన్న మనస్పర్థలను పరిష్కరించి, ఈ జంటను తిరిగి ఒకటి చేయడానికి కుటుంబ సభ్యులు తెరవెనుక గట్టి ప్రయత్నాలే చేసినట్లు తెలుస్తోంది. కొడుకు- కోడలిని కలపడానికి విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ అత్యంత కీలక పాత్ర పోషించారని తెలుస్తోంది. కొడుకు రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అలాగే కుటుంబ బంధాలను కాపాడుకోవడానికి శోభ స్వయంగా కోడలు సంగీతతో మాట్లాడి, ఇరుపక్షాల మధ్య ఉన్న విభేదాలను పరిష్కారం అయ్యేలా చేసినట్లు సమాచారం. తల్లి చేసిన ఈ గట్టి ప్రయత్నాల వల్లనే విజయ్ - సంగీత మళ్లీ కలిసి ఒకే ఇంట్లో ఉండటానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెన్నై వర్గాల సమాచారం. విజయ్ త్వరలోనే పూర్తిస్థాయి రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో.. భార్య సంగీత మళ్లీ ఆయన పక్కన చేరడం పొలిటికల్‌గా కూడా విజయ్‌కు చాలా ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంకోపక్క విజయ్ కొడుకు జేసన్ సంజయ్ కి కూడా ఇప్పుడు తండ్రి సపోర్ట్ చాలా అవసరం. అందుకే సంగీత కూడా భర్తతో ఉండడానికి ఒప్పుకొన్నారని అంటున్నారు. ప్రేమ, పెళ్ళి అంటూ విజయ్ వెనుక తిరిగిన త్రిషకు ఇప్పటివరకు ఒరిగింది ఏం లేదు. అలాంటప్పుడు విజయ్ - సంగీత కలిసిపోతే త్రిష సైలెంట్ గా ఉంటుందా.. అన్న చర్చ కూడా సాగుతోంది.

## మూడు క్షిపణి పరీక్షలు సక్సెస్

### డీఆర్డీవో కీలక ముందడుగు

**న్యూఢిల్లీ,జూన్ 13 ( మహాప్రభ)**
డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో) మరో కీలక ముందడుగు వేసింది. ఈనెల 10, 11వ తేదీల్లో 3 క్షిపణి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. దీంతో భారత్ తన స్వదేశీ క్షిపణి తయారీలో కీలక ముందడుగు వేసిందని చెప్పుకోవాలి. ఈ టెస్టుల్లో డీఆర్డీవో బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ క్షిపణి




ప్రయోగాలతో పాటు.. యాంటీ షిప్ వార్ ఫేర్‌లో కొత్త టెక్నాలజీ ప్రయోగాల్లోనూ సక్సెస్ సాధించింది.

**5 వేల కి.మీ అవతల శత్రువున్నా..**

చండీగఢ్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి మధ్య శ్రేణి బాలిస్టిక్ క్షిపణి, అధునాతన ఇంటర్ సెప్టర్ క్షిపణులను అధికారులు ప్రయోగించారు. ఈ ఇంటర్ సెప్టర్ వ్యవస్థలు 2 వేల కిలోమీటర్లు, 5 వేల కిలోమీటర్ల దూరంలో ఉండే శత్రువుల బాలిస్టిక్ క్షిపణులను కూడా గురి చూసి ధ్వంసం చేయగలవు. ఖండాంతర క్షిపణులను కూడా టార్గెట్ చేసి ధ్వంసం చేయగల సామర్థ్యంతో వీటిని డీఆర్డీవో రూపొందించింది. దీంతో బీఎండీ సామర్థ్యం కలిగిన దేశాల సరసన భారత్ చేరినట్టు అయింది.

# సింగపూర్ పర్యటనకు సీఎం చంద్రబాబు..

(మొదటి పేజీ తరువాయి)

క్యాపిటలిస్టులతో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం పాల్గొంటారు. అనంతరం యూఎన్ హబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాల్డియా రాస్ బాచ్‌తో విందు సమావేశంలో పాల్గొంటారు. సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్‌తో పాటు పలువురు ప్రముఖులతో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా గూగుల్ క్లౌడ్ ఏపీఏపీ అధ్యక్షుడు కరణ్ భజ్వా జీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అడ్వైజర్ లీమ్ సియాంగ్ గోన్, వైస్‌హెచ్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాబర్ట్ యాప్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ టాన్ యెంగ్ చైలతో సీఎం చర్చలు జరపనున్నారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్, హోం మంత్రి కె షణ్ముగం, మానవ వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్‌తో కూడా సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల అవకాశాలపై చర్చించనున్నారు. అలాగే సీఎం ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందంతో సమావేశం నిర్వహించనున్నారు. రెండో రోజు జూన్ 16న కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని సీబీఎన్‌ఎస్ 361 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం ఏపీఏపీ సెమికండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. అమరావతి ప్రణాళికలకు సంబంధించి సూర్యానా జూరాంగ్ సంస్థతో సమావేశం నిర్వహించనున్నారు. తర్వాత సింగపూర్ ఉప ప్రధాని, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్ బృందంతో భేటీ అవుతారు. వరల్డ్ సిటీస్ సమ్మిట్ లీడర్స్ పీనరీలో ప్రసంగించడంతో పాటు ఎగ్జిబిషన్‌ను సందర్శించనున్నారు. సింగపూర్ పెవిలియన్, ఇన్వెస్టలర్ ఆలయ్, గూగుల్ టెక్నాలజీస్ స్టాల్స్‌ను పరిశీలించనున్నారు. అలాగే సీఈఈయం సమావేశం, సీఎం పార్టనర్‌షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్ షోలో కూడా సీఎం పాల్గొంటారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రితో పాటు పురపాలక శాఖ మంత్రి నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఏడీసీ సీఈఓ షణ్మోహన్, సీఆర్డీఏ అధికారుల బృందం పాల్గొననుంది. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకురావడం, రాజధాని అమరావతి అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యాలను పెంచడం లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. జూన్ 16వ తేదీ రాత్రి 10 గంటలకు సీఎం చంద్రబాబు స్వదేశానికి తిరిగి రానున్నారు.

# అస్సాంలో ఐఎఎఫ్ విమానం కూలి ఐదుగురు సైనికులు మృతి




**జోర్హాట్**

భారత వైమానిక దళాని (ఐఎఎఫ్)కి చెందిన విమానం అస్సాంలోని జోర్హాట్ జిల్లాలో ఒక వైమానిక స్థావరంలో శనివారం ల్యాండ్ అవుతుండగా కూలిపో యింది. ఈ ప్రమాదంలో ఐదుగురు సిబ్బంది మరణించారు. విమానంలోని కో పైలెట్ ఒకరు ప్రాణాలతో బయటపడ్డారని, తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. 'విధి నిర్వహణలో వుండగా స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభమ్ కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్ వాయు ఖెమరం కుమవత్, అగ్నివీర్ వాయు డానిష్ ఆలమ్‌లు తమ జీవితాలను త్యాగం చేశారని ' సామాజిక మాధ్యమం ఎక్స్‌లో భారత వైమానిక దళం(ఐఎఎఫ్) ప్రకటించింది. శనివారం 43వ స్క్వాడ్రన్‌కు చెందిన ఎఎన్-32 విమానంలో కార్గోను తీసుకెళుతూ రౌరియా ఏరియాలో వైమానిక స్థావరంలో ల్యాండ్ అవుతుండగా ఈప్రమాదం సంభవించింది. దీనికి గల కారణాలను తెలుసుకోవడానికి కోర్ట్ ఆఫ్ ఇంక్వైరీని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. విషయం తెలిసిన వెంటనే సీనియర్ ఐఎఎఫ్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే మొత్తంగా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను మూసివేశారు, ఎవరినీ లోపలకు అనుమతించ లేదు. విచారణలో విమానంలో సాంకేతిక లోపాలు ఏమైనా తలెత్తాయా?, ఇంజిన్ వైఫల్యం ఏమైనా జరిగిందా, లేదా ప్రమాదం జరిగిన సమయంలో వాతావరణ పరిస్థితులు వంటివి కీలకం కానున్నాయి. ప్రమాద సమయంలో కాక్‌పిట్‌లో ఉన్న వారిలో కో-పైలట్ మాత్రమే ప్రాణాలతో బయటపడటంతో, ప్రమాదం జరిగిన తీరును అర్థం చేసుకోవడానికి ఆయన ఇచ్చే వాంగ్మూలం ఈ విచారణలో అత్యంత కీలకం కానుంది. ఈ ఘటనపై భారత వైమానిక దళం అధికారికంగా స్పందిస్తూ, "ఈ విషాదకర ఘటనలో అమరులైన వీర జవాన్ల కుటుంబాలకు భారత వాయుసేన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది. ఈ కష్టకాలంలో అమరవీరుల కుటుంబాలకు వాయుసేన అండగా నిలుస్తుంది" అని పేర్కొంది.

# 16 ఏండ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్!

**-యూకే ప్రభుత్వం నిర్ణయం!**
**-సెక్సువల్ ఏఐ చాట్‌బాట్ల వినియోగంపై 18 ఏండ్ల లోపు వారికి నిషేధం**
**-సోమవారం అధికారికంగా నిబంధనలు ప్రకటించనున్న ప్రధాని**
**-సర్వేలో నిషేధానికి మద్దతుగా 90 శాతం మంది తల్లిదండ్రుల మొగ్గు**



**లండన్, జూన్ 13**

యూకే ప్రధాని కీర్ స్టార్మర్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 16 ఏండ్ల లోపు పిల్లలకు హైరిస్క్ సోషల్ మీడియా యాప్స్‌ను బ్యాన్ చేయబోతున్నట్టు తెలిపింది. అలాగే 18 ఏండ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాలో సెక్సువల్ ఏఐ చాట్‌బాట్లను వినియోగించకుండా నిబంధనలు పెట్టబోతున్నదని గార్డియన్ వార్తాసంస్థ తెలిపింది.సోమవారం ఈ నిర్ణయాన్ని స్టార్మర్ ప్రకటిస్తారని.. మంత్రులు ఏయే యాప్స్‌ను బ్యాన్ చేయాలో నిరయిస్తారని గార్డియన్ వెల్లడించింది. ఈ నిబంధనలపై 1,60,000లకు పైగా రిప్లైలు వచ్చాయని.. ప్రతి 10 మందిలో 9 మంది బ్యాన్ చేయాలని కోరారంటూ రిపోర్టులు చెప్తున్నాయి.

# భారత ఆర్మీ నూతన చీఫ్‌గా ధీరజ్ సేత్..

(మొదటి పేజీ తరువాయి)

1986లో ఆర్మర్డ్ కార్ప్స్ అధికారిగా భారత సైన్యంలో చేరారు. అప్పటి నుంచి వివిధ కీలక కమాండ్, స్టాఫ్, వ్యూహాత్మక బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. సైనిక విద్యలోనూ ఆయనకు విశేష అనుభవం ఉంది. ఫ్రాన్స్‌లోని పారిస్ మిలిటరీ కాలేజీలో డిఫెన్స్ సర్వీసెస్ కమాండ్ అండ్ జనరల్ స్టాఫ్ కోర్సు పూర్తిచేశారు. అదేవిధంగా అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న నావల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కూల్‌లో ఇంటర్నేషనల్ డిఫెన్స్ అక్విజిషన్ మేనేజ్‌మెంట్ కోర్సులో శిక్షణ పొందారు. ధీరజ్ సేథ్ ఎడారి ప్రాంతాల్లో సాయుధ రెజిమెంట్‌కు, అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో సాయుధ బ్రిగేడ్‌కు నాయకత్వం వహించారు. జమ్మూ-కాశ్మీర్‌లో తిరుగుబాటు నిరోధక దళానికి కమాండర్‌గా సేవలందించారు. అనంతరం సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు నాయకత్వం వహించి ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌గా కీలక జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. గత ఏడాది నిర్వహించిన 'ఆపరేషన్ సింధూర్' సమయంలో పూణే కేంద్రంగా ఉన్న సదరన్ కమాండ్‌కు ఆయన నాయకత్వం వహించారు. అనంతరం పశ్చిమ సరిహద్దు వెంబడి నిర్వహించిన త్రివిధ దళాల సంయుక్త విన్యాసాలను సమన్వయం చేశారు. అంగోలాలోని ఐక్యరాజ్యసమితి శాంతి భద్రతా మిషన్‌లోనూ ఆయన సేవలందించారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షాలపై హై అలర్ట్

**-భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తత**
**-అన్ని శాఖల మధ్య సమన్వయంతో చర్యలు**
**-ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ**
**-సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల మోహరింపు**
**-ట్రాఫిక్, విద్యుత్ తాగునీటి సేవలపై ప్రత్యేక దృష్టి**
**సమస్యాత్మక ప్రాంతాలకు టీమ్‌లను ముందుగా పంపండి**
**భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం ఆదేశాలు**



**తెలంగాణ బ్యూరో, ప్రతినిధి**

వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను మోహరించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగరాన్ని ప్రభావితం చేసే భారీ వర్షాలపై వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని అధికార యంత్రాంగం హై అలర్ట్ ఉండాలని ఆదేశించారు. గతంలో భారీ వర్షాల సమయంలో నగరంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలవడం, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడటం, లోతట్టు ప్రాంతాల్లో నివాసితులు ఇబ్బందులు పడటం వంటి పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో ఈసారి ముందస్తు చర్యలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటమే లక్ష్యంగా అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి వచ్చినా వెంటనే స్పందించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా వర్షపాతం ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. భారీ వర్షాల సమయంలో సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. పోలీస్ శాఖ, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ తోటి శాఖల సంబంధిత శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని ఆదేశించారు. ఒక శాఖ చేపట్టే చర్యలను మరో శాఖ సమాచారం అందించడం ద్వారా సమస్యలను వేగంగా పరిష్కరించవచ్చని ప్రభుత్వం భావించింది. ఉదాహరణకు, రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది వెంటనే నీటిని తొలగించే చర్యలు చేపడితే, ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి ప్రజలకు ఇబ్బందులు తగ్గించాలి. విద్యుత్ అంతరాయాలు ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సరఫరా పునరుద్ధరించాలి. ఇలాంటి సమస్యలు చర్యల ద్వారా నగరంలో సాధారణ పరిస్థితులు కొనసాగేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. భారీ వర్షాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, కోర్ అర్బన్ రీజియన్ ప్రత్యేక కార్యదర్శితో పాటు ఇతర సీనియర్ అధికారులకు ముఖ్యమంత్రి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. యుద్ధ ప్రాతిపదికన పరిస్థితిని సమీక్షిస్తూ, అవసరమైన నిర్ణయాలు వెంటనే తీసుకోవాలని సూచించారు. కేవలం కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించడం కాకుండా, క్షేత్రస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను అంచనా చేయాలని ఆదేశించారు. వాతావరణ శాఖ నుంచి వచ్చే తాజా సమాచారం ఆధారంగా చర్యలను చేపట్టేందుకు ముందస్తు సన్నద్ధం కావాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరగకుండా అధికారులకు పూర్తి స్వేచ్ఛ కల్పించారు. హైదరాబాద్ నగరంలో ప్రతి వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, కాలువలు పొంగిపొర్లే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ ప్రత్యేక బృందాలను మోహరించాలని ఆదేశించారు. భారీ వర్షాల ప్రారంభం కంటే ముందుగానే యంత్రాంగం సిద్ధంగా ఉండడం వల్ల నష్టాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. పంపులు, జేసీబీలు, అత్యవసర వాహనాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కూడా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రధాన రహదారుల వద్ద నీటి నిల్వలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. వర్షాల కారణంగా నగర ప్రజలు ఎక్కువగా ఎదుర్కొనే సమస్యల్లో ట్రాఫిక్ అంతరాయాలు, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, తాగునీటి సమస్యలు ప్రధానమైనవి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని, రద్దీ ప్రాంతాల్లో అప్రమత్త సిబ్బందిని నియమించాలని ఆలోచించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదకరంగా మారే విద్యుత్ స్తంభాలు, తీగలను పరిశీలించి ప్రమాదాలను నివారించాలి, వాటర్ బోర్డ్ అధికారులు మరుగు నీరు తాగునీటిలో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందేలా అన్ని శాఖలు 24 గంటలు అందుబాటులో ఉండాలని సీఎం స్పష్టం చేశారు. భారీ వర్షాల సమయంలో ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని అధికారులు తెలిపారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్న సమయంలో జనం అప్రమత్తంగా ఉండి ప్రయాణాలను నివారించాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచనలను ప్రజలు పాటించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ఫేక్ న్యూస్, నమ్మదగని వార్తలు ప్రచారం చేయవద్దని సమాచారం. సోషల్ మీడియా ద్వారా వచ్చే అబద్ధ ప్రచారాలను నమ్మకుండా అధికారుల సమాచారం మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహాయక బృందాలు అన్ని సమయాల్లో అందుబాటులో ఉండాలని ప్రభుత్వం హామీ ఇచ్చింది. హైదరాబాద్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరంలో భారీ వర్షాల సమయంలో సమర్థవంతమైన నిర్వహణ అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు, శాఖల మధ్య సమన్వయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా వర్షాల వల్ల కలిగే ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు 24 గంటల పాటు పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. ప్రజల భద్రత, నగర సాధారణ జీవనాన్ని కొనసాగించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉంది.

# గడువుకు ముందే పంజాబ్ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముందస్తు ఎన్నికలకు కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా నిలిచిన ఓటర్లకు కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. బర్నాలా, మోగా, బటాలా, బటిండా మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్లుగా ఆప్ కౌన్సిలర్లు ఎన్నికయ్యారని, పార్టీ పాలనపై ప్రజలకున్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని, మరోసారి మాన్ సీఎం అయ్యేందుకు పార్టీ కార్యకర్తలందరూ కృషి చేయాలని కేజ్రీవాల్ కోరారు. గత నాలుగేళ్లుగా పంజాబ్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని, మద్దతును సాధించిందని అన్నారు. పార్టీల పేరు చెప్పకుండా విపక్షాలపై కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. ఒకటి 'చిట్టా పార్టీ', మరొకటి 'ఫైటింగ్ పార్టీ', మూడో పార్టీ 'ఈడీ పార్టీ' అని అభివర్ణించారు. డ్రగ్స్ సమస్యలు, అంతర్గత పోరాటాలు, సెంట్రల్ ఏజెన్సీలతో ప్రత్యర్థులను భయపెట్టే పార్టీలుగా వారిని పోల్చారు. ప్రజాసంక్షేమ, అభివృద్ధి కోసం పని చేసే పార్టీ ఆప్ మాత్రమేనని, పంజాబ్ నేతల్లో అత్యంత నిజాయితీ కలిగిన ముఖ్యమంత్రుల్లో భగవంత్ మాన్ ఒకరని ప్రశంసించారు. గత ప్రభుత్వాలు అవినీతి, కుంభకోణాల ఆరోపణలు ఎదుర్కొన్నాయని, మాన్ హయాంలో అలాంటి ఆరోపణలు ఒక్కటి కూడా లేవని అన్నారు. ఏవైనా తప్పులు చేసి ఉంటే ఈడీ, సీబీఐ చర్య తీసుకుని ఉండేవని అన్నారు. పంజాబ్‌లో పలు సంక్షేమ పథకాలను ఆప్ అమలు చేస్తోందని, ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకూ ఆరోగ్య బీమా ప్రజలకు అందిస్తోందని కేజ్రీవాల్ గుర్తుచేశారు. జూలై నుంచి అర్హత కలిగిన మహిళలకు ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. షెడ్యూల్డ్ కులాల మహిళలకు రూ.1,500 చొప్పున ఇస్తామని తెలిపారు. కేజ్రీవాల్ రోడ్‌షోలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా, పంజాబ్ ఆప్ అధ్యక్షుడు అమన్ అరోరా పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సినిమా ఫస్ట్ ఆఫ్ ఫెయిల్

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, సినిమా ఫస్ట్ హాఫ్ డిజాస్టర్ అయినప్పుడు సెకండ్ హాఫ్ పట్ల ప్రేక్ష?కుల్లో నిరాశ ఎలా ఉంటుందో.. ఈ ప్రభుత్వ పనితీరు కూడా అలాగే ఉందన్నారు. అమ్మ విలువ, అన్నం విలువ అవి లేనప్పుడే తెలుస్తాయని, ఇప్పుడు ప్రజలు అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం 'తరుగు' పేరుతో రైతులను నిలువునా మోసం చేస్తోందని, ఎరువుల దుకాణాల వద్ద రైతులు మళ్లీ పాత రోజుల మాదిరిగా క్యూల్లో నిలబడే దుస్థితి వచ్చిందని అన్నారు. ధాన్యం కొనుగోలుకు సంచులు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే, రాహుల్ గాంధీకి మాత్రం సంచుల సంచులు డబ్బులు వెళు_న్నాయని ఆరోపించారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికల ముందు బాండ్ పేపర్ పై రాసిచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయలేదని, దీనిపై సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హిట్లర్ తనకు స్ఫూర్తి అని చెప్పుకున్న సీఎం రేవంత్ రెడ్డి నుంచి ప్రజలు ఇంకేం ఆశించలేరని, ఆయనకు డైలాగులు ఎక్కువ-పని తక్కువ అని ఎద్దేవా చేశారు. ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు అవమానం జరిగేలా వ్యవహరించిన వ్యక్తి రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. ప్రజలు పాలు ఇచ్చే బర్రెను వదిలి, తన్నే దున్నపోతును తెచ్చుకున్నట్టుగా కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారని వ్యాఖ్యానిం చారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కేసీఆరేనని, మళ్లీ కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి అవసరమని స్పష్టం చేశారు. "నాకు జన్మనిచ్చింది శోభమ్మ అయితే, రాజకీయంగా పునర్జన్మనిచ్చింది సిరిసిల్ల ప్రజలే" అని కేటీఆర్ భావోద్వేగం తో చెప్పారు. రూపాయి పంచకుండా, చుక్క మద్యం పంచకుండా ప్రజల ఆశీర్వాదంతో గెలిచినందుకు సిరిసిల్ల ఎమ్మెల్యేగా గర్వపడుతున్నానని తెలిపారు. కార్మిక, ధార్మిక క్షేత్రమైన సిరిసిల్లను కేసీఆర్ నాయకత్వంలో జిల్లాగా మార్చి రూపురేఖలు మార్చామని చెప్పారు. ఈ నెల 25 తర్వాత వేములవాడ నియోజకవర్గంలోని ప్రతి మండలాన్నీ స్వయంగా సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుంటా నని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండా గెలుపును ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, కొండూరి రవీందర్ రావు, తుల ఉమా, తోట ఆగయ్య, న్యాలకొండ అరుణ, జిందం కళ జిందం చక్రపాణి, చీటీ నర్సింగారావు, గూడూరి ప్రవీణ్, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి, ఏనుగు మనోహర్ రెడ్డి, గజానంద రావు పాల్గొన్నారు.

# బీజేపీ తీరు అప్రజాస్వామికం

(మొదటి పేజీ తరువాయి)

కేసుకు సంబంధించి ఎవరు లీక్ చేశారనే విషయం విచారిస్తున్నామని చెప్పారు. ఎంతటి వారైనా పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, విలువలను తుంగలో తొక్కి తిరిగి మాపైనే బురద జల్లుతున్నారని విమర్శించారు. అప్పడు ఓటు చోరీ ..ఇప్పుడు సీటు చోరీ బీజేపీకే సాధ్యమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఇలా వ్యవహరిస్తే మోడీ ప్రధాని అయ్యేవారా అంటూ ప్రశ్నించారు. బెంగాల్, మహారాష్ట్ర లో ఆ పార్టీ ఏం చేసిందో దేశ ప్రజలు చూశారని గుర్తు చేశారు. 12 ఏండ్లలో ఈ దేశానికి మోడీ చేసిందేమి లేదన్నారు. ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొట్టి బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని పవన్‌కళ్యాణ్ గుర్తుంచుకోవాలన్నారు. షబ్బీర్ అలీ ఆరోపణలు పై తొందరపడి స్పందించాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వ్యాఖ్యలపై షోకాజ్ నోటీస్ ఇచ్చామని తెలిపారు. ఫోర్త్ సిటీని అడ్డుకుంటామని బీఆర్‌ఎస్ అనడం మూర్ఖత్వమన్నారు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డిది ముగిసిన అధ్యాయమని పేర్కొన్నారు. అరాచకం చేసైనా అధికారంలోకి వస్తామని బీజేపీ ఎంపీ అర్వింద్ చెప్పడాన్ని తప్పు పట్టారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఇప్పుడున్న 8 మంది బీజేపీ ఎంపీలు కూడా ఓడిపోతారని అన్నారు. 2028లో రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ?

# పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

**19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు**




**హైదరాబాద్**

పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.

# ఏపీకి కేంద్రం భారీ గ్రాంట్




, అమరావతి

ఆంధ్రప్రదేశ్ లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. 16వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రానికి మొత్తం రూ.16,627 కోట్ల గ్రాంట్ కేటాయించింది. ఈ నిధులు 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభమై వచ్చే ఐదేళ్ల కాలంలో విడుదల కానున్నాయి. మంజూరైన నిధుల్లో బేసిక్ గ్రాంట్ కింద రూ.13,302 కోట్లు, పెర్ఫార్మెన్స్ గ్రాంట్ కింద రూ.3,225 కోట్లు ఉన్నాయి. గతంలో 15వ ఆర్థిక సంఘం ద్వారా ఐదేళ్ల కాలానికి రూ.12,800 కోట్లు లభించగా, ఈసారి అదనంగా రూ.3,827 కోట్లు ఎక్కువగా కేటాయించడం విశేషం. ఈ నిధులను గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది. రోడ్ల నిర్మాణానికి కేవలం 10 శాతం వరకు మాత్రమే ఖర్చు చేసే అవకాశం ఉంది. మిగిలిన మొత్తాన్ని గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించనున్నారు.

# సంపాదకీయం

## ఎల్‌నినో కార్యాచరణ ఏదీ ?



ఎల్‌నినో హెచ్చరికల నేపథ్యంలో పాలకులు అప్రమత్తం కావాల్సి ఉంది. ముఖ్యంగా సాగు, తాగునీరుతో పాటు, వ్యవసాయ విధానంపై ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కావాల్సి ఉండగా అంలాంటిదేమీ కనిపించడం లేదు. ఇప్పుడు దీని ప్రభావంతో భారతదేశానికి కరువు కాలం కమ్ముకొస్తుంది. దీనిపై ప్రజలను రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, కార్యాచరణకు సిద్ధం కావాల్సి ఉంది. నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పడతాయి.. వ్యవసాయం బాగుంటుందని ఆశిస్తున్న రైతులకు ఇది అశనిపాతం లాంటిదే. ఎల్ నినో వచ్చేసిందని.. ఈ రుతు పవనాల సమయంలో అది మరింత బలపడుతుందని భాతర వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో ఎల్ నినో ప్రారంభం అయినట్లు జపాన్ వాతావరణ సంస్థ జూన్ 11వ తేదీన అధికారికంగా ప్రకటించటం విశేషం. పసిఫిక్ సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగటాన్ని ఎల్ నినో అంటారు. సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సహజంగా 3.4 డిగ్రీలుగా ఉంటుంది. ఇప్పుడు అది పాయింట్ 5 శాతం పెరిగింది. అంటే సముద్రం నీరు ఉండాల్సిన వేడి కంటే అధిక వేడిగా ఉన్నాయి. దీన్ని ఎల్‌నినో అంటారు. జూన్ నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో ఎల్‌నినో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. జూలై మధ్య నుంచి తూర్పు పసిఫిక్ అంతటా విస్తరిస్తుందని.. ఇదంతా రుతు పవనాల కాలంలోనే జరుగుతుందని వాతావరణ శాఖ నివేదిక స్పష్టం చేస్తుంది. సహజంగా నైరుతి రుతు పవనాల సీజన్ లో చల్లటి వాతావరణంతోపాటు నికరంగా వర్షాలు పడతాయి. ఎల్‌నినో ప్రభావంతో సముద్రం నీరు వేడెక్కటం వల్ల సముద్రం నుంచి భూమిపైకి వేడి గాలులు వీస్తాయి. భూమిపై ఎక్కువగా పొడి వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షపాతం తక్కువగా ఉంటుంది. దీంతో కరువు వస్తుంది. దీనికితోడు అక్కడక్కడ కుండపోత వర్షాలు ఉంటాయి. క్లౌడ్ బరస్టులు ఉంటాయి. దీని వల్ల విపత్తులు వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు తక్కువగా ఉండటం వల్ల నీళ్ల కొరత ఏర్పడుతుంది. మంచి నీళ్లకు.. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యవసాయానికి అవసరం అయిన నీళ్లు లేక పంటలు పండవు. ఆదాయం లేక రైతులు, రైతు కూలీలకు ఇబ్బంది వస్తుంది. ఎల్‌నినో అధికారంగా ప్రారంభం అయిన భారత వాతావరణ శాఖ ప్రకటనతో ప్రభుత్వాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రైతులు పంటలు సాగు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికి మించి పంటలకు సంబంధించి ఆరుతడి పంటలకు రైతులను ప్రోత్సాహించాలి. సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుంది కాబట్టి, వరి లాంటి పంటలకు రైతులు దూరంగా ఉండాలి. మనకున్న వనరులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కార్యాచరణ సిద్ధం చేయాలి. ఎల్‌నినోకు కారణం ఓ రకంగా చెప్పాలంటే పర్యావరణ విధ్వంసమే. మన చేజేతులా పర్యావరణ విధ్వంసానికి పాల్పడిన పాపానికి విపరీత వాతావరణ పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం. వాతావరణ మార్పు, పర్యావరణ వ్యవస్థ నష్టం, భూమి ఎడారీకరణ వంటి తీవ్రమైన పరిణామాలతో మానవ-ప్రేరిత పర్యావరణ నష్టం పెరుగుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించడం, భూమి మరియు ప్రకృతిని వాటి సహజ స్థితికి పునరుద్ధరించడం ఇప్పుడు అంరి తక్షణ కర్తవ్యం కావాలి. భూమిని రక్షించడానికి, పునరుద్ధరించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. పర్యావరణ విధ్వంసం నిరంతరంగా సాగడంవ వల్ల మన భూమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఎడారీకరణ, భూమి క్షీణత, కరువు అనేది మన కాలంలోని అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లలో ఒకటి. ఇటీవలే జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నాం. అయినా మనలో మార్పు కానరావడం లేదు. చెరువులను మింగేస్తున్నాం. ప్లాస్టిక్ భూతాన్ని భూమిపైకి వదిలేస్తున్నాం. మన పర్యావరణాన్ని రక్షించడానికి ప్రపంచవ్యాప్త అవగాహన, కార్యాచరణను ప్రోత్సహించడానికి మాటలతో సరిపెడుతున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పర్యావరణంపై దృష్టి సారించి, ఏటా చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ఎల్‌నినో ప్రభఆవాలు వచ్చే వచ్చేవి కావు. ఇప్పటికైనా మనమంతా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, పద్ధతులపై దృష్టి సారించాలి. మన భవిష్యత్తు, మన తరం, భూమి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఆ వైపు కార్యాచరణను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలి. పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు, సైన్సు సంస్థలు ఎల్‌నినో దుష్ఫలితాలపై విస్తృతంగా ప్రచారంనిర్వహించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి. ద ఈ నిని ప్రజా ఉద్యమంగా దిశా నిర్దేశం చేయాలి. అన్ని పర్యావరణ పరిరక్షణ సంస్థలు, వ్యక్తులు ఒక ఉద్యమంలా ఐక్యంగా పనిచేయడం ద్వారా ధరిత్రిని కాపాడుకోవాలి. ఈ క్రమంలో తక్షణంగా ప్రస్తుత విపత్తును తట్టుకునే కార్యాచరణకు రంగం సిద్దం చేయాలి. కేంద్రం తక్షణమే రాష్ట్రాలతో సంప్రతింపులు జరిపి వ్యయసాయ స ంక్షోభ నివారణకు చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపైనా చర్చించాలి.

# ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

**-- కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, జూన్ 13 ( మహాప్రభ)**

జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్--2010 అమలు, రిజిస్ట్రేషన్లు, అనుమతుల జారీపై సమీక్ష జరిగింది. ఆసుపత్రుల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తులను నిర్దేశిత గడువులో పరిష్కరించి, మూడు నెలల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పరిశీలించిన తర్వాతే ఎన్‌ఓసీలు జారీ చేయాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. శ్రీరామ్, జిల్లా ఫైర్ ఆఫీసర్ ముప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షురాలు ఆకుల శైలజ, ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారి నీలిమా, పోలీసు శాఖ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లు జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు.

# మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా

**-హవేలీ ఘన్‌పూర్‌లో ఎక్సైజ్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు**





**మెదక్, జూన్ 13 ( మహాప్రభ)**

మెదక్ జిల్లాలో మత్తు పదార్థాల రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు ఎక్సైజ్ పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం హవేలీ ఘన్‌పూర్ మండల కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మాన్ సింగ్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రధాన రహదారులపై ప్రత్యేక నిఘా పెట్టి, అనుమానాస్పద వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాన్ సింగ్ మాట్లాడుతూ, “గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలి” అని హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో అల్ట్రాటెక్ కార్మికుడు మృతి



**పాలకుర్తి, జూన్ 13 ( మహాప్రభ)**

పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ పర్మనెంట్ కార్మికుడు దుర్గం మల్లయ్య (55) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటినుంచి డ్యూటీకి బయలుదేరిన కొద్దిసేపటికే వేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. సంఘటనపై బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాద దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డవడంతో లారీని గుర్తించి పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. మృతుని కుటుంబానికి కంపెనీ యాజమాన్యం ఉద్యోగం, దహన సంస్కారాలకు రూ.30 వేల సాయం, రూ.20 లక్షల ఇన్సూరెన్స్, ఈపీఎఫ్ డబ్బులు, భార్యకు పెన్షన్ ఇవ్వడానికి అంగీకరించింది. మల్లయ్య అకాల మరణంపై కార్మిక సంఘం నాయకులు, తోటి కార్మికులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలో రికార్డైన ప్రమాద దృశ్యాలు వైరల్‌గా మారాయి.

# ట్రామా కేసుల్లో గోల్డెన్ అవర్ కీలకం

**-- మెడికవర్ వైద్యులు రాజీవ్‌రెడ్డి, వేణుగోపాల్**




**పెద్దపల్లి, జూన్ 13 ( మహాప్రభ)**

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాజీవ్‌రెడ్డి, డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంటను వైద్యరంగంలో ‘గోల్డెన్ అవర్’గా పరిగణిస్తారని, ఈ సమయంలో సరైన చికిత్స అందితే మెదడు, వెన్నెముక, అంతర్గత అవయవాలకు జరిగిన నష్టాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. యువత అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, ప్రమాద స్థలంలో వీడియోలు తీయడం కంటే బాధితుడిని రక్షించే దిశగా ముందుకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తలకు గాయాలు, వెన్నెముక దెబ్బతినడం, అంతర్గత రక్తస్రావం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయని, తలనొప్పి, వాంతులు, మూర్ఛ, స్పృహలో మార్పులు ఉంటే వెంటనే న్యూరో వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక చికిత్సపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, ప్రమాద బాధితులకు సహాయం చేసే వారిపై చట్టపరమైన ఇబ్బందులు ఉండవని, ప్రభుత్వం గుడ్ సమారిటన్ నిబంధనల ద్వారా రక్షణ కల్పిస్తోందని వైద్యులు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చని వైద్యులు స్పష్టం చేశారు.

# పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత

**- కేంద్ర మంత్రి బండి సంజయ్**



**సిరిసిల్ల/కరీంనగర్ , జూన్ 13 ( మహాప్రభ)**

: ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల సేవా స్ఫూర్తితో, కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు మేరకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మన బడి--మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. సిరిసిల్లలోని కుసుమ రామయ్య జడ్పీహెచ్‌ఎస్‌లో బండి సంజయ్ స్వయంగా తరగతి గదులను శుభ్రం చేసి, డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, అదనపు తరగతి గదులకు రూ.20 లక్షల సాయం ప్రకటించారు. పదో తరగతి విద్యార్థులందరికీ ఉచిత సైకిళ్లు, పరీక్ష ఫీజులు తన వేతనం నుండి చెల్లిస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్ నగరంలోని కుమార్‌వాడి ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో కార్పొరేటర్ చంద్ర టింకూ శ్రమదానం చేసి పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. 53వ డివిజన్ మోరీలలో చెత్త తొలగింపు పనులను శ్వేత రామన్ పర్యవేక్షించారు. తీగలగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్ పోలీస్‌క్వార్టర్స్ ప్రాథమిక పాఠశాలలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రత మనందరి బాధ్యత అని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. స్మార్ట్ సిటీ నిధుల కింద రూ.14 కోట్లతో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, రూ.10 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బండి సంజయ్, సునీల్ రావు పిలుపునిచ్చారు.

# గత సంవత్సరం కంటే మెరుగ్గా జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ.

**చివరి దశకు ధాన్యం కొను గోలు ప్రక్రియ.**

**-415 ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలలో కొనుగోలు పూర్తి.**

**-90,669 రైతుల నుండి 4,01,033.440 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు.**

**-73,429 మంది రైతులకు 786.06 కోట్ల రూపాయలు ఎకౌంట్లో జమ.**

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -13జూన్ (మహాప్రభ )**
గతంలో కంటే మెరుగ్గా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై శనివారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేస్తూ గతంలో కంటే మెరుగ్గా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాల సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 415 కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి ముగించడం జరిగిందన్నారు.చివరి దశకు ధాన్యం కొను గోలు ప్రక్రియ చేరుకుందని 90,669 రైతుల నుండి 4,01,033.440 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి73,429 మంది రైతులకు 786.06 కోట్ల రూపాయలు ఎకౌంట్లో జమ చేయడం జరిగింది అన్నారు రవాణా, గోదాముల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మిల్లుల వద్ద త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

# సైబర్ మోసాల పట్ల మరియు పరిష్కారంపై అవగాహన కార్యక్రమం

**దేవరకొండ జూన్ 13 ( మహాప్రభ)**
ఈరోజు ఉదయం 6:15 నిమిషాలకు స్థానిక దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.బి.ఏ. ఓ. బి సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మరియు ఎస్.బి ఐ. బబి నల్గొండ ఏ ఓ మాడిల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ వి టి మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, ఆర్బిఐ లేదా ఇతర సంస్థల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్ ఎస్ఎంఎస్ లు లింకులు నమ్మి ఓటిపి. పాస్వర్డ్ వంటి వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, తెలియని లింకులపై క్లిక్ చేయరాదని, ఏదైనా అనుమానస్పద లాంటి లావాదేవీలు జరిగినట్లయితే వెంటనే 1930 సైబర్ హెల్ప్ లైన్ కాల్




చేయండి, లేదా సైబర్ క్రైమ్ పోర్టల్లో ఫిర్యాదు చేయండి లేదా మీ దగ్గరలో ఉన్న బ్యాంకులో సంప్రదించగలరని అన్నారు. ఆరం. పి . పద్మ బాబుగౌడ్ నాయకత్వంలో ఆర్ బి ఓ నల్గొండ ఆధ్వర్యంలో సైబర్ మోసాల నివారణ పరిష్కారంపై ఈరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఎన్జీ కళాశాల నల్గొండ, మేకల అభినవ స్టేడియం నల్గొండ, ప్రభుత్వ జూనియర్ కళాశాల దేవరకొండ, ప్రభుత్వ జూనియర్ కళాశాల మిర్యాలగూడ, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎస్బిఐ సిబ్బంది పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమం విజయంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు మరియు కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, ఆర్ బి ఓ తరుపున చీఫ్ మేనేజర్ శ్రీమతి ప్రీతి , భీమ్ సింగ్ నాయక్, వెంకట్ రామ్, చరణ్, సోమ, మణిదీప్, నాగార్జున, కృష్ణ, శ్రీకాంత్, శరత్, దేవరకొండ, మల్లేపల్లి, చింతపల్లి, చెరుకుపల్లి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సులు జర భద్రం బిడ్డ

**గాంధారి, జూన్ 13 (మహాప్రభ)**
బిడ్డ ప్రైవేట్ స్కూల్ బస్సులు భద్రమేనా పిట్ నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సులు రోడ్డెకితే వెంటనే సిజ్ చేయాలి.వేసవి సెలవుల కారణంగా స్కూల్ బస్సుల పిట్ నెస్ పై దృష్టి పెట్టని ఆర్టిఏ అధికారులు.ఇంకో రెండు రోజులల్లో తెరుచుకొనున్న పాఠశాలలు...ఇంకా పూర్తికానీ కొన్ని ప్రైవేట్ స్కూల్ పిట్ నెస్ బస్సులు.ఆర్టిఏ అధికారులు దృష్టి సరించి పట్టుపడితే ప్రైవేట్ స్కూల్ బస్ ల కేసులు తప్పవు.

ఏఐఎస్.బి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్

కామారెడ్డి జిల్లా : ఉమ్మడి జిల్లాలోని వేసవి సెలవుల కారణంగా పాఠశాలలు మూత పడగా ప్రైవేట్ స్కూల్ బస్సులు ఎక్కడికక్కడే ఉండిపోయాయి,మరి కొన్ని శుభాకార్యలకు,విహారాయత్రాలకు ప్రైవేట్ స్కూల్ బస్సులనూ అద్దెలకు ఇవ్వడంతో తాజాగా అవి కూడా పిట్నెస్ సమస్యలకు తలెత్తాయని ఏ ఐ ఎస్ బి ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నేల 15 నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రైవేట్ స్కూల్ బస్సులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించిన తర్వాతే ఆర్టిఏ అధికారులు రోడ్డుపైకి అనుమతించాలి,చాలా రోజులగా కొన్ని బస్సులనూ నడపకపోవడంతో ప్రమాదలకు గురయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు.ఇకపై ప్రైవేట్ స్కూల్ కు



చెందిన అర్హత సామర్థ్యం,డొక్కు బస్సులు 15 సంవత్సరాలు దాటి ఉన్న బస్సులు రోడ్డెకితే ఆర్టిఏ అధికారులు వెంటనే ఆ బస్సులనూ సిజ్ చేయాలనీ ఆయన పేర్కొన్నారు.ఇంకో రెండు రోజులల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆర్టిఏరవాణా శాఖ అధికారులు ప్రైవేట్ స్కూల్,కళాశాలల యాజమాన్యలతో బస్సుల పిట్నెస్ తప్పనిసారి వెంటనే చేయుంచుకొవాలని అవగహన కల్పించాలని ఆయన అధికారులను కోరారు లేని యెడల ఆ బస్సులను వెంటనే సిజ్ చేయాలని ఆయన ఆర్టిఏ అధికారులు కోరారు..ఈ నిబంధనలు తప్పనిసరి ప్రైవేట్ స్కూల్ బస్సులకు తప్పనిసరిగా పసుపు రంగు వేయించడంతో పాటు నాలుగు వైపుల స్కూల్ పేరు ఫోన్ నెంబర్ కనిపించే విధంగా ఉండాలి.డ్రైవర్ కు ఐదు ఏళ్ల సీనియర్టీతో పాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.డ్రైవర్ వివరాలను జిల్లా రవాణా అధికారులకు



తీయలియజేయాలి.బస్సు క్లినర్లు కొత్త వ్యక్తులు స్కూల్ బస్సులను నడుపారాదు.బస్సులలో తప్పనిసరిగా ఫస్ట్ ఏయిడ్ బాక్స్ తో పాటు శానిటైజర్ అందుబాటులో ఉంచాలి.బస్సులో డ్రైవర్ కు కనపడేలా ఇరువైపులా అద్దాలు,ఎమర్జెన్సీ డోర్ ఉంచాలి.బస్సుల డ్రైవర్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో హెల్త్ ధ్రువీకరణ పత్రాన్ని అందించాలి.అగ్ని ప్రమాదాలు సంబావించినప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫైర్ ఎక్సిటింగ్ విషర్ లు ఉంచాలి లేని యెడల ఆ ప్రైవేట్ స్కూల్ బస్సులనూ వెంటనే ఆర్ టి ఏ అధికారులు సిజ్ చేయాలని ఆయన కోరారు.

# గాంధారిలో ఘనంగా బీజేపీ కిసాన్ మోర్చా 'రైతు అవగాహన సదస్సు'

**గాంధారి, జూన్ 13 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండలం భారతీయ జనతా పార్టీ శాఖ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వికసిద్భారత్ 2047 విజన్ తో దానిలో భాగంగా భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో అన్నదాతలకు నూతన వ్యవసాయ పద్ధతులు సేంద్రియ వ్యవసాయం ప్రకృతి వ్యవసాయం ఆధునిక పద్ధతులను వివరించడానికి భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శనివారం రోజున కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బసవ లక్ష్మీ నర్సయ్య



ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో జైరాబాద్ పార్లమెంట్ లోని ముఖ్యమైన నాయకులందరూ పాల్గొంటారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా స్టేట్ సెక్రటరీ పొన్నాల వెంకట రెడ్డి, కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు కిషన్ రావు, జిల్లా జనరల్ సెక్రెటరీ రవీందర్ రావు, మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, మాజీ అధ్యక్షులు సాయిబాబా, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ శ్రీకాంత్, ప్రభాకర్, మొజిరం, బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన బుద్ధుల బిక్షపతి



**శివ్వంపేట్ జూన్ 13 (మహాప్రభ):**
మెదక్ జిల్లా శివ్వంపేట్ మండలానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకుడు బుద్ధుల బిక్షపతి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుద్ధుల బిక్షపతి ఎస్పీని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇద్దరి మధ్య కొద్దిసేపు పలు అంశాలపై చర్చ జరిగింది. శివ్వంపేట్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బుద్ధుల బిక్షపతి ఎస్పీని కోరారు. దీనికి స్పందించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మండల ప్రజలకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని హామీ ఇచ్చారు.

# జిల్లా సర్పంచుల ఫోరమ్ ఉపాధ్యక్షుడిగా శ్రీధర్



**పాపన్నపేట, జూన్ 13( మహా ప్రభ )**
మెదక్ జిల్లా సర్పంచుల ఫోరమ్ ఉపాధ్యక్షుడిగా కుర్తివాడ గ్రామ సర్పంచ్ చెట్టుకింది శ్రీధర్ నియమితులయ్యారు. శనివారం కుర్తివాడలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు,మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు,పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ చేతుల మీదుగా శనివారం శ్రీధర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. సర్పంచుల సమస్యల పరిష్కారానికి శ్రీధర్ కృషి చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సేవే మా ప్రథమ ధ్యేయం

**-మాజీ ఎమ్మెల్యే హన్మంత రావు**



**పాపన్నపేట, జూన్ 13 (మహాప్రభ )**
మైనంపల్లి సోషల్ సర్వీస్ ద్వారా పేద ప్రజలకు విస్తృతంగా సేవా చేస్తున్నట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు వివరించారు. గ్రామాల్లో నీటి సమస్యల పరిష్కారానికి వేలాది బోర్లు వేసినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రజా సేవా మా విధానమన్నారు. శనివారం మండలం లోని ఎల్లాపూర్,కుర్తివాడ పలు గ్రామాల్లో బోర్లకు మోటర్లు సామాగ్రి అందజేసి ఆయన ప్రారంభించారు. అధికారులతో సమావేశమై అభివృద్ధి పనులను వేగవంతం చేస్తానని నాయకులతో అన్నారు. విస్తృతంగా గ్రామాల్లో పర్యటించారు. హస్తం శ్రేణులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు గౌడ్,ఉపాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి,మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,కిసాన్ సెల్ నాయకులు ప్రభాకర్ రెడ్డి,జిల్లా సర్పంచుల ఫోరమ్ ఉపాధ్యక్షుడు శ్రీధర్,మండలాధ్యక్షుడు నీరుడి వెంకటేశం,జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్ అప్ప,సర్పంచులు..పుట్టిశేఖర్,అంజయ్య,విజయ దుర్గా నాని,నాయకులు గోవింద్ నాయక్, కిష్టయ్య,గౌస్, ఖలీమ్, దోసనిసంగమేశ్వర్, అనుదీప్,చోటు,వినేష్ గౌడ్,కుమ్మరి శంకరయ్య,ఏసు,భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ రోజు బీజేపీ వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం.

**మెదక్ జిల్లా -13జూన్ (మహాప్రభ ).**
మెదక్ జిల్లా కేంద్రంలో నూతన బీజేపీ కార్యాలయంలో మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా మెదక్ పార్లమెంటు సభ్యులు



మాధవనేని రఘునందన్ రావు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి మెదక్ జిల్లా మీడియా ఇంచార్జి చికోటీ ప్రవీణ్ పాల్గొంటారని ఈర్ల రంజిత్ రెడ్డి బీజేపీ మెదక్ జిల్లా ప్రధానకార్యదర్శి తెలిపారు.

# కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తహసిల్దార్ నిఖిలా రెడ్డి



**కరీంనగర్, జూన్ 13 ( మహాప్రభ)**
తాజాగా తహసిల్దార్‌గా పదోన్నతి పొందిన నిఖిలా రెడ్డి శనివారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె ఇటీవల జరిగిన పదోన్నతుల్లో తహసిల్దార్‌గా ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా నిఖిలా రెడ్డిని అభినందిస్తూ, కొత్త బాధ్యతల్లో సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. నిఖిలా రెడ్డి పదోన్నతి సందర్భంగా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలవడం విశేషం.

# మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్




**గంగాధర, జూన్ 13 ( మహాప్రభ)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో మాల సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. మాలల జనాభా 25--30 లక్షల పైగా ఉన్నప్పటికీ వర్గీకరణలో అన్యాయం జరిగిందని, దీనివల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని వారు పేర్కొన్నారు. మాలలకు సముచిత స్థానం కల్పించేందుకు వర్గీకరణలో సవరణలు చేసి, రిజర్వేషన్ శాతం 15% నుండి 25%కి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలకు ప్రాధాన్యత ఇస్తున్నందున మాలల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అత్యవసరమని అన్నారు. మాలల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రిజర్వేషన్ శాతం పెంచాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

# గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు కీలకం - ఎస్సై వంశీకృష్ణ



**గంగాధర, జూన్ 13 ( మహాప్రభ)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని వెంకంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీస్ స్టేషన్ ఎస్సై వంశీకృష్ణ శనివారం ప్రారంభించారు. గ్రామ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ లక్ష్యంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పిట్టలపల్లి జంక్షన్ వద్ద 4 సీసీ కెమెరాలు, గ్రామంలోని ఇతర ప్రాంతాల్లో 3 సీసీ కెమెరాలు అమర్చారు. ఈ సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ, సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు, అనుమానాస్పద కదలికలను గుర్తించడానికి, ప్రజల భద్రతను మెరుగుపరచడానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన పంచాయతీ పాలకవర్గాన్ని ఎస్సై అభినందించారు. వెంకంపల్లి గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు కీలకమని అధికారులు పేర్కొన్నారు.

# ఎల్‌ఓసి అందజేసిన ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి



**తెలకపల్లి, జూన్ 13 ( మహాప్రభ)**
బొపెల్లి గ్రామానికి చెందిన మల్లేష్ చికిత్స కోసం నిమ్స్ హాస్పిటల్‌లో చేరగా, సీఎం సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల ఎల్‌ఓసి చెక్కును ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అందజేశారు. ఈ సహాయానికి ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నిరంజన్, బాల గౌడ్, బుచ్చిరెడ్డితో పాటు గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## జూన్ 17, 18 తేదీలలో ఎల్‌ఐఎఎఫ్‌ఐ-
# 1964 జనరల్ బాడీ సమావేశం




**హైదరాబాద్, జూన్ 13 ( మహాప్రభ)**
భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య ఎల్‌ఐఎఎఫ్‌ఐ-1964 తమ జనరల్ బాడీ సమావేశాన్ని జూన్ 17, 18 తేదీలలో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా 3000 మందికి పైగా సాధారణ మండలి సభ్యులు, జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు, ప్రతినిధులు పాల్గొని జీవిత బీమా ఏజెంట్లు, పాలసీదారులకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించనున్నారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.బి. శ్రీనివాసచారి, అధ్యక్షుడు కౌటికె విఠల్, రాజ్యాంగ కమిటీ చైర్మన్ బి.ఎన్. చారి, స్వాగత కమిటీ చైర్మన్ సింగారపు శ్రీనివాస్, ప్రెస్ అండ్ పబ్లిసిటీ కమిటీ చైర్మన్ షేక్ షాజహాన్ సమావేశానికి హాజరయ్యారు. ఎల్‌ఐఎఎఫ్‌ఐ నాయకత్వం తెలిపిన ప్రకారం, వేగంగా మారుతున్న బీమా రంగం, ఏజెంట్లు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో ఈ సమావేశం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. బీమా రంగంలోని ప్రస్తుత పరిణామాలను సమీక్షించి, ఏజెన్సీ బలగాన్ని బలోపేతం చేయడం, పాలసీదారుల ప్రయోజనాలను పరిరక్షించడం కోసం వ్యూహాలు రూపొందించనున్నారు. అలాగే ఏజెంట్ల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి, బీమా సేవలలో డిజిటల్ రూపాంతరం, వినియోగదారుల సేవా ప్రమాణాల పెరుగుదల, దేశవ్యాప్తంగా బీమా వ్యాప్తి పెంపు వంటి అంశాలపై కూడా చర్చ జరగనుంది. సమాఖ్య గత కార్యకలాపాలపై నివేదికలు సమర్పించబడతాయి. భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన పలు తీర్మానాలు ఆమోదించబడే అవకాశం ఉంది. ఎల్‌ఐఎఎఫ్‌ఐ-1964 జీవిత బీమా ఏజెంట్ల ప్రయోజనాలను కాపాడడం, నైతిక బీమా విధానాలను ప్రోత్సహించడం, భారత బీమా రంగ అభివృద్ధికి తోడ్పడడం పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. సమావేశం ముగిసిన అనంతరం ఆమోదించిన తీర్మానాలపై సమగ్ర వివరాలను మీడియాకు అందజేయనున్నట్లు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు.

---

## బీఎల్‌ఏల శిక్షణ అవగాహన
# సదస్సులో పాల్గొన్న వొడితల ప్రణవ్



**హుజురాబాద్, జూన్ 13 ( మహాప్రభ)**
హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్ శనివారం బీఎల్‌ఏల శిక్షణ అవగాహన కార్యక్రమంలో పాల్గొని బీఆర్‌ఎస్ నేత కౌశిక్ రెడ్డి, హరీష్ రావు వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. ఉప ఎన్నికల తర్వాత హుజురాబాద్ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూపాయి కూడా కేటాయించలేదని, కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీగా ఏం పని చేశాడో చెప్పే దమ్ము లేదని మండిపడ్డారు. హరీష్ రావు ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు హుజురాబాద్‌కు ప్రత్యేక ప్యాకేజ్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. హుజురాబాద్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం, సర్పంచుల స్థానంలో మొదటి స్థానం, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముందంజలో ఉండటం కాంగ్రెస్ బలాన్ని చూపిస్తున్నదని ప్రణవ్ పేర్కొన్నారు. ఇకపై హుజురాబాద్‌లో ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ జెండా ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతులకు ఉచిత కరెంట్, రుణమాఫీ, వడ్ల--మక్కల కొనుగోలు వంటి సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే జరిగాయని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళిత బంధు నిధులను పూర్తిగా ఇవ్వలేదని, ప్రజలు కౌశిక్ రెడ్డిని తిరస్కరిస్తూ కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, వైస్ చైర్‌పర్సన్ అంజలి, కౌన్సిలర్లు, సర్పంచులు, మార్కెట్ చైర్మన్‌లు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా ఇంచార్జీలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హుజురాబాద్ ఇకపై కాంగ్రెస్ అడ్డా అని వొడితల ప్రణవ్ స్పష్టం చేశారు.

# ఘనంగా స్వచ్ఛ పాఠశాల - - స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్, హుజురాబాద్, హుస్నాబాద్, జూన్ 13 ( మహాప్రభ)**
ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల సుపరిపాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపుమేరకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మన బడి--మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. బొమ్మకల్ 6వ డివిజన్‌లో కార్పొరేటర్ మేకల వెంకటేష్ ఆధ్వర్యంలో, హుజురాబాద్ జడ్‌పీహెచ్‌ఎస్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొని, ఉప్పల్ జడ్‌పీహెచ్‌ఎస్‌లో బీజేపీ శ్రేణులు పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు. కరీంనగర్ నగరంలోని 66వ డివిజన్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో, 38వ డివిజన్ లక్ష్మీనగర్ ప్రభుత్వ పాఠశాలలో కూడా పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలంలో పలు గ్రామాల్లో, అలాగే పొట్లపల్లి, మహమ్మదాపూర్, మీర్జాపూర్, బల్లు నాయక్ తండ, పందిళ్ళ, వంగరామయ్యపల్లి గ్రామాల్లో పాఠశాలలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతూ, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ఇల్లు, పాఠశాల నుంచే ప్రారంభమవుతుందని, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, మౌలిక వసతుల కల్పన కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచి, పిల్లలను చేర్పించడం ద్వారా విద్యాభివృద్ధి సాధ్యమని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.

# జగనన్న కాలనీలో చిమ్మ చీకటి
### మౌలిక వసతుల లోపంపై సిపిఎం ఆగ్రహం



**నందికొట్కూరు, జూన్ 13 ( మహాప్రభ)**
నందికొట్కూరు కొణిదెల రోడ్డులోని జగనన్న కాలనీలో వీధి లైట్లు వెలగకపోవడంతో ప్రజలు చిమ్మ చీకటిలో జీవనం సాగిస్తున్నారు. దొంగల భయం, విషసర్పాల భయంతో కాలనీ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ పరిస్థితిని స్వయంగా పరిశీలించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. నాగేశ్వరరావు ప్రభుత్వంపై మండిపడ్డారు. కనీస మౌలిక వసతులు అయిన కరెంటు, రోడ్లు, నీటి వసతి, ప్రజా పంపిణీ చౌక డిపో, అంగన్వాడి సెంటర్, వితంతువులు, వికలాంగులు, వృద్ధులకు పెన్షన్లు అందించకపోతే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కాలనీ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే తీవ్ర నిరసనలు తప్పవని సిపిఎం నాయకులు స్పష్టం చేశారు.

# గూడెం ఆలయ అభివృద్ధి, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన



**మంచిర్యాల, జూన్ 13 ( మహాప్రభ)**
మంచిర్యాల జిల్లాలో గూడెం శ్రీరామసహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధి పనులు, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలతో కొత్త ఊపు వచ్చింది. శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ప్రేమసాగర్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ కలిసి ఆలయ పునరుద్ధరణ పనులు, రూ. 74.40 కోట్ల వ్యయంతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, రైతులకు సాగునీరు అందుబాటును మెరుగుపరిచే లక్ష్యంతో ఈ పథకాలు ప్రారంభమయ్యాయని, వందల ఎకరాలకు నీరు అంది రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు కొత్త ఊపునిస్తున్నాయని ప్రజాప్రతినిధులు తెలిపారు.

# బిజినెస్

## మరోసారి భారీగా పెరిగిన
# బంగారం, వెండి ధరలు..

**ఇంటర్‌నెట్,**
పశ్చిమాసియాలో ఉద్రిక్తల కారణంగా తిరోగమనంలో ఉన్న బంగారం ధరలు గత మూడు రోజుల నుంచి భారీగా పెరుగుతున్నాయి. (శుక్రవారం)10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 2,940 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 2,700 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 2210 రూపాయలు పెరిగింది. శనివారం) కూడా బంగారం ధరలు పెరిగాయి.
10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 500 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 450 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 370 రూపాయలు పెరిగింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,49,080 రూపాయల వద్ద.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,36,650 రూపాయల వద్ద.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం



1,11,810 రూపాయల వద్ద ట్రేడ్ అయింది
వెండి ధరలు..
100 గ్రాముల వెండిపై 500 రూపాయలు.. కేజీ వెండిపై 5000 రూపాయలు పెరిగింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాద్ మార్కెట్‌లో 100 గ్రాముల వెండి 27,000 రూపాయల వద్ద.. కేజీ వెండి 2,70,000 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.
గమనిక: బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి కొనుగోలు చేసే ముందు ఒకసారి ధరలను చెక్ చేసుకోవలసిందిగా సూచన.

## షావోమీ నుంచి
## షావోమీ 17టీ ఫోన్ విడుదల..

**- బెస్ట్ కెమెరా, పవర్‌ఫుల్ బ్యాటరీ.. పూర్తి ఫీచర్లు, ధర ఇవే**




చైనాకు చెందిన షావోమీ సంస్థ నుంచి షావోమీ 17టీ పేరుతో స్మార్ట్‌ఫోన్ ఇటీవల ఇండియాలో విడుదలైంది. దాదాపు ఫ్లాగ్‌షిప్ ఫీచర్లతో, కాస్త అందుబాటు ధరలోనే ఈ ఫోన్ విడుదలైంది. ఇప్పటికే సేల్‌లో అందుబాటులోకి వచ్చింది. 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, క్వాలిటీ ట్రిపుల్ కెమెరా వంటి ఫీచర్లున్నాయి.షావోమీ వెబ్‌సైట్, అమెజాన్, రిటైల్ స్టోర్లలోనూ ఈ ఫోన్ అందుబాటులో ఉంటుంది. ఈ ఫోన్ కొంటే ఏడాదిలోపు 60 శాతం బైబ్యాక్ ఆఫర్ కూడా ప్రకటించింది కంపెనీ. ఈ ఫోన్ కొంటే 4 నెలల స్పాటిఫై ప్రీమియం, 3 నెలల యూట్యూబ్ ప్రీమియం, గూగుల్ ఏఐ వంటివి ఉచితంగా పొందవచ్చు. వివిధ కార్డులపై డిస్కౌంట్‌తోపాటు ఎక్స్ఛేంజ్ ఆఫర్ కూడా ఇస్తోంది. ఈ ఫోన్‌లోని కీలక ఫీచర్లివి. 6.59 అంగుళాల 1.5కే అమోలెడ్ డిస్‌ప్లే, 3,500 నిట్స్ పీక్‌బ్రైట్‌నెస్, 120 హెర్ట్జ్ రిఫ్రెష్‌రేట్, మీడియాటెక్ డిమెన్సిటీ 8500 అల్ట్రా ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 బేస్డ్ హైపర్‌ఓఎస్ 3, 50 ఎంపీ లైట్ ఫ్యుజియన్ 800 మెయిన్ కెమెరాం50ఎంపీ పెరిస్కోప్ టెలిఫొటో కెమెరాం12ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, 32 ఎంపీ సెల్ఫీ కెమెరా, 12జీబీం256జీబీ, 12జీబీం512జీబీ, బ్లూటూత్ 6.0, వైఫై 7, ఐపీ68 రేటింగ్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, 67 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్, 22.5 వాట్స్ రివర్స్ ఛార్జింగ్ వంటి ఫీచర్లున్నాయి. ధర రూ.59,999/రూ.64,999.

## భారత్‌లో 'స్టార్‌లింక్'
# శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు బ్రేక్

భారత్‌లో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు వార్తలు వెలువడ్డాయి. కేంద్ర హోంశాఖ తుది భద్రతా అనుమతులను నిలిపివేసినట్లు సమాచారం. ఇరాన్ యుద్ధంలో స్టార్‌లింక్ టెర్మినల్స్ వినియోగంపై భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేయడంతో, భారత భద్రతా నిబంధనలకు సంస్థ పూర్తిగా కట్టుబడి ఉంటుందా అనే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇరాన్ వివాదంతో అనుమతుల ప్రక్రియ నిలిచిపోయిందన్న వార్తలను స్టార్‌లింక్ ప్రతినిధులు ఖండించినట్లు సమాచారం. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




# స్పోర్ట్స్

# వైభవ్ సూర్యవంశీ అద్భుత బాలుడు


**భారత క్రికెట్‌కు లభించిన ఒక నిధి**
**సీనియర్ల కన్నా అద్భుతంగా బ్యాటింగ్**
**వైభవ్ సూర్యవంశీది ప్రత్యేకమైన కేటగిరీ**
**దక్షిణాఫ్రికా పేసర్ డేల్ స్టెయిన్ ప్రశంసా**

పీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అందరినీ తనవైపు తిప్పుకున్నాడు. ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా నిలిచాడు. అత్యధిక సిక్సర్లు కూడా బాదాడు. త్వరలోనే టీమిండియా తరపున అరంగేట్రం కూడా చేయనున్నాడు. ప్రస్తుతం అతడి పేరు దేశంలో మార్మోగుతుంది.ఈ క్రమంలో దక్షిణాఫ్రికా దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ వైభవ్ సూర్యవంశీపై సంచలన కామెంట్స్ చేశాడు. సూర్యవంశీ కెరీర్ ముగిసే సమయానికి ఆ ఇద్దరి రికార్డులను బద్దలు కొడతాడంటూ కామెంట్స్ చేశాడు. దక్షిణాఫ్రికా టీ20 లీగ్ ( సీజన్ 5 ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్టెయిన్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దక్షిణాఫ్రికాలో వైభవ్ సూర్యవంశీ స్థాయిని అందుకోగల యువ ఆటగాళ్లు ఎవరైనా ఉన్నారా? అని ప్రశ్నించగా, స్టెయిన్ చాలా స్పష్టమైన సమాధానం ఇచ్చారు. "వైభవ్ సూర్యవంశీ ఒక ప్రత్యేకమైన కేటగిరీ. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న చాలా మంది సీనియర్ ఆటగాళ్ల కంటే అతడు అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. అతడొక




అద్భుత బాలుడు, భారత క్రికెట్‌కు లభించిన ఒక నిధి" అని కొనియాడారు."మనం సచిన్, విరాట్ కోహ్లీ లాంటి గొప్ప ఆటగాళ్ల గురించి మాట్లాడుకుంటాం. కానీ ఈ కుర్రాడు రాబోయే రోజుల్లో ఒక విస్ఫోటనంలా మారబోతున్నాడు. కెరీర్ ముగిసే సమయానికి సచిన్, కోహ్లీ ఇద్దరినీ కలిపినా వారి కంటే పెద్ద స్టార్ అవుతాడు" అని స్టెయిన్ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అంచనా వేశారు. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఈ 15 ఏళ్ల ఎడమచేతి వాటం బ్యాటర్ ఐపీఎల్ 2026 సీజన్‌లో బౌలర్లకు చుక్కలు చూపించాడు. 16 మ్యాచుల్లో ఏకంగా 776 పరుగులు సాధించి ప్రతిష్ఠాత్మక 'ఆరెంజ్ క్యాప్'కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీలో 237.30 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడమే కాకుండా, ఏకంగా 72 సిక్సర్లు బాది ఒకే ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన క్రిస్ గేల్ పాత రికార్డును బద్దలు కొట్టాడు. ఈ అసాధారణ ప్రదర్శన కారణంగానే వైభవ్ సూర్యవంశీ త్వరలో జరగబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల కోసం భారత టీ20 జట్టుకు కూడా ఎంపికయ్యాడు. వైభవ్ సూర్యవంశీ ప్రతిభను ఆకాశానికెత్తిన స్టెయిన్, అదే సమయంలో బీసీసీఐని హెచ్చరించాడు. "గొప్ప బాధ్యతలతో పాటు గొప్ప ఫలితాలు వస్తాయి. కానీ ఈ వయసులో అతడిని ఎలా మేనేజ్ చేస్తారు, ఎలా చూసుకుంటారు అనేది చాలా ముఖ్యం. అతడిని సరిగ్గా చూసుకోకపోతే, త్వరగానే ఆ అద్భుతమైన టాలెంట్‌ను భారత్ కోల్పోయే ప్రమాదం ఉంది" అని స్టెయిన్ హెచ్చరించారు.అంతర్జాతీయ క్రికెట్‌లో 699 వికెట్లు పడగొట్టిన స్టెయిన్‌ను 'ఈ కుర్రాడిని ఎలా ఔట్ చేయాలి?' అని అడగ్గా.. "నేను అతడి ఆటను పూర్తిగా విశ్లేషించలేదు. కానీ ఐపీఎల్‌లో కాగిసో రబాడా అతడికి బాగా బౌలింగ్ చేశాడు. వైభవ్ ఇంకా చాలా చిన్నవాడు (15 ఏళ్లు). కాబట్టి బౌలర్లు షార్ట్ పిచ్ బంతులతో అతడి మైండ్‌తో ఆడాలి. క్రికెట్‌లో భయపెట్టే గుణం ముఖ్యం. షార్ట్ బాల్స్ వేసి కాస్త భయం పుట్టిస్తే అతడిని కట్టడి చేయవచ్చు" అని తన వ్యూహాన్ని పంచుకున్నారు.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో ఓడిన పీవీ సింధు




సిడ్నీ
ఆస్ట్రేలియన్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీలో హైదరాబాదీ ప్లేయర్ పీవీ సింధు( సెమీఫైనల్లో ఓటమి చవి చూసింది. జపాన్‌కు చెందిన మేటి ప్లేయర్ అకేన్ యమగుచి చేతిలో ఆమె వరుస గేమ్స్‌లో పరాజయాన్ని ఎదుర్కొన్నది. 20-22, 12-21 స్కోరుతో యమగుచి విజయం సాధించింది. మూడో నెంబర్ ర్యాంక్‌తో జపనీస్ ప్లేయర్ ఈ టోర్నీలో ఆడారు. కేవలం 43 నిమిషాల్లోనే ఈ మ్యాచ్ ముగిసిపోయింది. సింధు ఓటమితో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారతీయ క్రీడాకారుల ప్రాతినిధ్యం ముగిసింది.ఫస్ట్ గేమ్‌లో జపాన్ ప్లేయర్‌కు ధీటుగా సింధు ఆడింది. షాట్‌కు షాట్ కొట్టింది. ఇద్దరు ఆటగాళ్లు ఓ దశలో ఆరు వరుస పాయింట్లను సాధించుకున్నారు. కానీ గేమ్ పాయింట్ వద్ద సింధు తడబడింది. ఓపెనింగ్ గేమ్‌ను యమగుచి చేజిక్కించుకున్నది. ఇక సెకండ్ గేమ్‌లో సింధు ఆటతీరు పూర్తిగా మారిపోయింది. యమగుచి చాలా ఈజీగా దూసుకెళ్లింది. ఓ దశలో 13-6 పాయింట్లు సాధించింది. ఎటువంటి ఇబ్బందులు లేకుండానే యమగుచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నది. ఇక సింగిల్స్ ఫైనల్లో థాయ్‌ల్యాండ్ క్రీడాకారిణి పోర్న్‌పావీ చోచువాంగ్‌తో యమగుచి తలపడనున్నది. ఇటీవల కాలం యమగుచి చేతిలో సింధు వరుసగా ఓటమి ఎదుర్కొన్నది. ఆరు మ్యాచుల్లో అయిదు సార్లు ఓడంది. కానీ ఓవరాల్‌గా 15-13 తేడాతో సింధు లీడింగ్‌లో ఉంది.

# 87 బంతుల్లో 103 రన్స్..

**రెచ్చిపోయిన వైభవ్ సూర్యవంశీ సోదరుడు**

పాట్నా
అన్న స్టయిల్‌లోనే తమ్ముడు కూడా రెచ్చిపోతున్నాడు. యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ తమ్ముడు ఆశీర్వాద్(ఞఖంష్ట్రఱతీఖ్ఖుస) కూడా తన బ్యాట్‌తో అలరిస్తున్నాడు. సమస్తిపూర్‌లో జరిగిన ఓ లోకల్ మ్యాచ్‌లో.. ఆశీర్వాద్ సూపర్ సెంచరీ కొట్టేశాడు. ఒకవైపు వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ మ్యాచ్‌లపై దృష్టి పెడుతుండగా, ఇక అతని తమ్ముడు ఆశీర్వాద్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నాడు. తాజ్‌పూర్ క్రికెట్ అకాడమీ తరపున ఆడుతున్న ఆశీర్వాద్ 87 బంతుల్లో 103 రన్స్ చేశాడు. దాంట్లో 20 ఫోర్లు, ఓ సిక్సర్ ఉన్నాయి. అతను 118.39 స్ట్రయిక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. ఆశీర్వాద్ సెంచరీ కొట్టిన తర్వాత .. సోషల్ మీడియాలో వైభవ్ సూర్యవంశీ తన సోదరుడికి



కంగ్రాట్స్ చెప్పాడు.మరో వైపు జాతీయ జట్టుకు ఎంపికైన వైభవ్ సూర్యవంశీ ఫ్యామిలీపై ప్రశంసలు కురుస్తున్నాయి. గ్రామస్థులు ఇంటికి వచ్చి విషెస్ చెబుతున్నారని, స్వీట్లు.. లడ్డూలు పంచుతున్నారని తండ్రి సంజీవ్ సూర్యవంశీ తెలిపారు. ఇంటి వద్ద బాణాసంచా కూడా కాల్చామన్నార. చిన్నతనం నుంచి వైభవ్ చాలా కష్టపడ్డాడని, దేశం కోసం ఆడాలన్న తపన అతనిలో ఉందన్నాడు. అతని కష్టానికి ఫలం దక్కిందని, దేశానికి ఆడే సౌభాగ్యం వచ్చిందన్నాడు. వైభవ్ సక్సెస్ పట్ల చాలాచాలా సంతోషంగా ఉందన్నాడు.

# ఓ సుకుమారి...టీజర్ విడుదల




తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ..! సుకుమారి'. భరత్‌దర్శన్ దర్శకుడు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రమిది. మహేశ్వరరెడ్డి మూలి నిర్మిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం టీజర్ విడుదలైంది. ఒక్క నిజం దాచి పెట్టి కథానాయకుడిగా పెళ్లి చేస్తే ఏం జరిగిందన్న ఆసక్తికర అంశానికి వినోదాన్ని జోడించి ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. ఝాన్సీ, మురళీధర్‌గౌడ్, ఆనంద్, అంజిమామ, శివానంద్, కోట జయరామ్ తదితరులు నటిస్తున్నారు.

# ఓటిటిలోకి వచ్చిన దృశ్యం-3





మలయాళ చిత్ర పరిశ్రమలో సూపర్ స్టార్ మోహన్ లాల్, సంచలన దర్శకుడు జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో వచ్చిన 'దృశ్యం' సిరీస్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పటికే వచ్చిన రెండు భాగాలు దేశవ్యాప్తంగా సంచలన విజయం సాధించగా.. ఇటీవల విడుదలైన మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'దృశ్యం 3' కూడా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టింది. అయితే థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్, విడుదలైన నెలలోపే ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై అలరించేందుకు సిద్ధమైంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో భారీ ధరకు కైవసం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం జూన్ 18 నుంచి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అయితే మలయాళంలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం, తెలుగు బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ప్రస్తుతానికి ఈ సినిమా కేవలం మలయాళం భాషలోనే స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల డబ్బింగ్ వెర్షన్ల విడుదలపై ఓటీటీ సంస్థ నుంచి ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.



## చీరలో అందంగా మెరిసిపోతున్న సంయుక్తా మీనన్..

# కలెక్షన్లలో దూసుకెళ్తున్న పెద్ది

### ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది.ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలన వసూళ్లు నమోదు చేసిన 'పెద్ది' తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. సినిమా విడుదలై తొమ్మిది రోజులు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా కలెక్షన్ల వివరాలను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం, 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా తొలి తొమ్మిది రోజుల్లో ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ భారీ వసూళ్లతో రామ్ చరణ్ కెరీర్‌లో 'పెద్ది' రెండో అతిపెద్ద గ్రాసర్‌గా నిలిచింది. ముఖ్యంగా సోలో హీరోగా చరణ్ నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఇది రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యం, క్రీడా అంశాలు, భావోద్వేగాలతో కూడిన కథ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది.ప్రస్తుతం వీకెండ్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'పెద్ది' త్వరలోనే రూ.400 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి చేరడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీకెండ్ ముగిసే నాటికి ఈ చిత్రం 400 కోట్ల మార్కును అందుకుంటుందా లేదా అనే అంశంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ లేకపోవడం, కుటుంబ ప్రేక్షకుల మద్దతు కొనసాగుతుండటం 'పెద్ది'కి అదనపు బలంగా మారింది.ఈ చిత్రంలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడిగా చేసిన పరివర్తన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కథను తెరకెక్కించిన తీరు కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకుంటోంది.



# మళ్లీ అలాంటి పాత్రల కోసం ఎదురుచూస్తున్నా..

### మనసులోని కోరిక బయటపెట్టిన కీర్తి సురేశ్

దక్షిణాది చిత్రసీమలో అందం, అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కథానాయిక కీర్తి సురేశ్. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె, తాజాగా తన సినీ ప్రయాణం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా 'మహానటి'లాంటి పాత్రలు మళ్లీ చేయాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కీర్తి సురేశ్, తన కెరీర్‌లో అత్యంత కీలకమైన చిత్రంగా నిలిచిన 'మహానటి' గురించి మాట్లాడారు. ఆ సినిమా తన జీవితాన్ని పూర్తిగా మార్చేసిందని, నటిగా తనకు కొత్త గుర్తింపును తీసుకొచ్చిందని చెప్పారు. ఇప్పటికీ ఆ చిత్రాన్ని గుర్తు చేసుకుంటే ఎంతో భావోద్వేగానికి గురవుతానని తెలిపారు.దక్షిణాది చిత్రసీమలో అందం, అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కథానాయిక కీర్తి సురేశ్. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె, తాజాగా తన సినీ ప్రయాణం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా 'మహానటి'లాంటి పాత్రలు మళ్లీ చేయాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కీర్తి సురేశ్, తన కెరీర్‌లో అత్యంత కీలకమైన చిత్రంగా నిలిచిన 'మహానటి' గురించి మాట్లాడారు. ఆ సినిమా తన జీవితాన్ని పూర్తిగా మార్చేసిందని, నటిగా తనకు కొత్త గుర్తింపును తీసుకొచ్చిందని చెప్పారు. ఇప్పటికీ ఆ చిత్రాన్ని గుర్తు చేసుకుంటే ఎంతో భావోద్వేగానికి గురవుతానని తెలిపారు.

# హాలీవుడ్‌లో మైఖేల్ మూవీ చరిత్ర

### సుమారు రూ. 8,673 కోట్ల భారీ వసూళ్లు




పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన బయోపిక్ 'మైఖేల్' ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులు సృష్టించింది. ఇప్పటివరకు మ్యూజిక్ బయోపిక్ చిత్రాలలో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా ఉన్న 'బోహేమియన్ రాప్సోడి' రికార్డును ఈ చిత్రం తాజాగా దాటేసింది. హాలీవుడ్ మీడియా కథనాల ప్రకారం, 'మైఖేల్' సినిమా ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 911.9 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,673 కోట్లు) భారీ వసూళ్లను రాబట్టింది. దీంతో గతంలో 910.9 మిలియన్ డాలర్ల లైఫ్‌టైమ్ కలెక్షన్లతో అగ్రస్థానంలో ఉన్న 'బోహేమియన్ రాప్సోడి'ని ఇది వెనక్కి నెట్టి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు 2022లో వచ్చిన ఎల్విస్ ప్రెస్లీ బయోపిక్ 'ఎల్విస్' రికార్డులను కూడా ఈ చిత్రం బద్దలు కొట్టింది. ఈ సినిమాకు ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వం వహించగా.. జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్‌లో నటించాడు. ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో రెంటల్ విధానంలో స్ట్రీమింగ్ అవుతుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com